
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 21 జనవరి 2025





వైసీపీ పాలనలో బోగస్ సదరం ధ్రువీకరణ పత్రాలను సమర్పించి పెన్షన్ సొమ్ము పెద్ద ఎత్తున కాజేశారు. కూటమి ప్రభుత్వం వాటిపై దృష్టి పెట్టింది. బోగస్ పెన్షన్ల ఏరివేత కోసం క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. పులివెందుల నియోజక వర్గంలో బోగస్ ధ్రువీకరణ పత్రాలతో పెన్షన్ సొమ్ము కాజేస్తున్న వారు ఎక్కువమంది ఉన్నారు. వీరందరిలో ఆందోళన నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా మంగళవారం నుంచి ప్రత్యేక వైద్యబృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టనుంది.



బోగస్‌లకు చెక్ పడేనా?

- నేటి నుంచి పింఛన్ల పరిశీలన
- తొలుత దివ్యాంగుల పింఛన్ల తనిఖీ
- వైద్యసాంకేతిక సిబ్బందితో ప్రత్యేక బృందాలు
- గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీ
- తొలిదశలో మంచం పట్టిన వారి పింఛన్ల వెరిఫికేషన్
- ఇంటింటికీ వెళ్లనున్న వైద్య బృందం

పులివెందుల టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి అడుగడుగునా అవకతవకలు జరిగాయి. కొన్ని ప్రాంతాల్లో అర్హుల కంటే అనర్హులే ఎక్కువగా ఉన్నారు. ఇటువంటి వారి లెక్క తేల్చాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ప్రతి దివ్యాంగ లబ్ధిదారుడి వైకల్యంతో పాటు వివరాలు సేకరించి అర్హులు ఎవరో, అనర్హులు ఎవరో తేల్చాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం నుంచి సర్వే ప్రారంభం కానుంది. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్ మొత్తం పెంచిన విషయం తెలిసిందే. పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో 7,209 పెన్షన్లు ఉండగా అందులో అభయహస్తం 74, డయాలసిస్ 14, వికలాంగులు 1,016, కుష్టు 2, వృద్ధాప్యపింఛన్లు 3,970, పెరాలసిస్ 21, సైనిక పెన్షన్ 1, యాక్సిడెండల్ పెరాలసిస్ 11, ఒంటరి మహిళ 260, వితంతువులు 1,950, చేనేత 13, కల్లుగీత కార్మికులు 15, ట్రాన్స్‌జెండర్స్ 11 ఉన్నాయి. వీరికి ప్రతినెలా రూ.కోట్లలో పెన్షన్లు చెల్లిస్తుండగా, అందులో డిజేబుల్డ్ డీఎంహెచ్‌వో పింఛనుదారులకు అధిక మొత్తంలో అందిస్తున్నారు. ఈ జాబితాలో అనర్హులు ఉన్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటన్నింటినీ పరిశీలించగా కొన్ని నిర్ధారణ జరగడంతో ఆ పెన్షన్లు నిలిపివేశారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని గ్రామాల్లో పెన్షన్లు తనిఖీ చేసింది. ఈ సందర్భంగా దొంగ సర్టిఫికెట్లతో కొందరు డిజేబుల్డ్ డీఎంహెచ్‌వో కేటగిరి కింద పెన్షన్లు పొందుతున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ రెండు కేటగిరీల్లోని పింఛన్ల పరిశీలనకు నిర్ణయం తీసుకుంది.

విచారణకు స్పెషలిస్ట్ వైద్యుల బృందాలు

చక్రాల కుర్చీ, మంచానికే పరిమితమై నడవలేని స్థితిలో పెన్షన్ పొందుతున్న వారి సదరం పత్రాల పరిశీలనకు జిల్లాలోని స్పెసలిస్ట్ వైద్యబృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందంలో ముగ్గురు వైద్యులు, ఒకరు గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంటు ఉంటారు. ప్రత్యేక ధ్రువీకరణ పత్రాలను క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించనున్నారు. వారంలో మూడురోజులు పులివెందుల ప్రాంతంలో స్పెషలిస్టుల వైద్యబృందం క్షేత్రస్థాయిలో పరిశీలించనుంది. పక్షవాతం, నరాల బలహీనత ఉందని బోగస్ పత్రాలతో లబ్ధిపొందుతున్న వారిపై వేటు వేయాలని నిర్ణయించారు. గత వైసీపీ పాలనలో రూ.3వేలు దివ్యాంగ పింఛను అందుతుండేది. కూటమి ప్రభుత్వం దాన్ని రూ.6వేలకు పెంచింది. మంచానికే పరిమితమైన వారిలో వ్యాధిని బట్టి రూ.3వేల నుంచి గత వైసీపీ ప్రభుత్వం రూ.6వేలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం దానిని రూ.15వేలు చేసింది. గత వైసీపీ పాలనలో శారీరకంగా మానసికంగా బాగున్న వృద్ధులు, దివ్యాంగుల కోటాలో రెండు మూడు పెన్షన్లు పొందుతున్నవారు ఉన్నారు. కొందరు బోగస్ దివ్యాంగ పత్రాలు పొందారు. వీరందరికీ వైసీపీ నేతల వత్తిళ్లతో పెన్షన్లు మంజూరు చేసినట్లు ఆరోపణలున్నాయి. అలాంటి వారి గుర్తింపునకు ప్రభుత్వం ఆదేశించింది.

సదరం స్లాట్‌ల నిలిపివేత

గత ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సదరం సర్టిఫికెట్లు జారీ చేయడంపై ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సదరం శ్లాటును కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. వీటిపై విచారణ పూర్తయ్యే వరకు సదరం స్లాటును అనుమతించరు. ఇప్పటికే స్లాటు పొందిన వారికి మాత్రం వైద్యపరీక్షలు నిర్వహిస్తారు.



నేటి నుంచి తనిఖీలు..



డిజేబుల్డ్ డీఎంహెచ్‌వో పింఛన్లు పరిశీలించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. తనిఖీలకు వైద్యసిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. నేటి నుంచి తనిఖీలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. దివ్యాంగుల పింఛన్ల తనిఖీ పక్కాగా చేపతాం. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేశాం. బోగస్ పింఛన్లు లేకుండా చూడడమే దీని ఉద్దేశ్యం. ప్రభుత్వం ఈ విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళుతుంది. లబ్ధిదారులు సహకరించాలి.

- రాముడు, పులివెందుల మున్సిపల్ కమిషనరు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు తదితరులు

28 నుంచి లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- పోస్టర్లు ఆవిష్కరించిన టీటీడీ ఈవో

తిరుమల, జనవరి20(ఆంధ్రజ్యోతి): దేవుడి కడపలోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం ఈవో శ్యామలరావు ఆవిష్కరించారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 7వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 28వ తేదీ సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు అంకురార్పణ జరుగనుంది. 29వ తేదీ ఉదయం 9.30 గంటలకు మీన లగ్నంలో ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10 గంటలకు స్వామి కల్యాణోత్సవం జరుగనుంది. రూ.300 చెల్లించి గృహస్తులు(ఇద్దరు) కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. ఫిబ్రవరి 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహిస్తారు. దీనికోసం భక్తులు పుష్పాలను సమర్పించవచ్చని టీటీడీ ప్రకటించింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రతిరోజు హరికథలు, భక్తి సంగీత ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణలో కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

కేతు స్మారక బంగారు పతకం కోసం రూ.3.5 లక్షలు

- వైవీయూకు అందజేసిన ఆచార్య కేతు కుటుంబం

కడప ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వైవీయూ తెలుగు శాఖలో ప్రతిభావంతులకు ఏటా కేతు విశ్వనాథరెడ్డి పేరిట స్మారక బంగారుపతకం, నగదు బహుమతి అందజేయనున్నారు. దీనికి సంబంధించి రూ.3.5 లక్షల చెక్కులను కేతు విశ్వనాథరెడ్డి కుమారుడు కేతు శశికాంత్ అందజేశారు. ఈ మేరకు సోమవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.కృష్ణారెడ్డి సమక్షంలో విద్యాలయ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, కేతు శశికాంత్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. అనంతరం చెక్కులను పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య కేఎస్‌వీ కృష్ణారావుకు అందజేశారు. వీసీ మాట్లాడుతూ ప్రఖ్యాత విద్యావేత్త, ప్రముఖ రచయిత, సాహిత్య విమర్శకుడు, తెలుగు సాహిత్య, సాంస్కృతిక అధ్యయనశీలి ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట అవార్డు నెలకొల్పడం సంతోషదాయకమన్నారు. సాంస్కృతిక వారసత్వానికి బలమైన పునాది వేసిన ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి చిరస్మరణీయుడన్నారు. యూనివర్సిటీ తెలుగు విభాగంలోని విద్యార్థుల్లో అకడమిక్ ఎక్సలెన్స్‌ను గుర్తించి రివార్డ్ చేయడం గోల్డ్‌మెడల్ లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా దివంగత కేతు విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు కేతు పద్మావతమ్మ, కేతు శశికాంత్, కేతు మాధవి, శిరీషలను వారు అభినందించారు.

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్యశిబిరాలు

కడప కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఈ నెలాఖరు వరకు ఉచిత పశు ఆరోగ్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాలకు సంబంధించిన పోస్టర్లను జేసీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరాలలో పశు వైద్య చికిత్సలు, గర్భకోశ వ్యాధులకు చికిత్స, వ్యాధి నిరోధక టీకాలు, నట్టల నివారణకు మందుల పంపిణీ, పశు వ్యాధి నిర్ధారణ పరీక్షలు, శాస్త్రీయ యాజామాన్యంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, పశుసంవర్ధక శాఖ ఏడీ శారదమ్మ, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జడ్పీ సీఈవో ఓబులమ్మ, డీపీవో స్వరాజ్యలక్ష్మి, వయోజన విద్య డీడీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘అయ్యో’ర్లపై రాఘవరెడ్డి తిట్ల దండకం

- నోరు తెరిస్తే బూతులు, దుర్భాషలు
- తన దయ ఉంటే ప్రమోషన్ లేదంటే సస్పెన్షన్
- ప్రభుత్వమిచ్చిన నోటీసులో విస్మయం కలిగించే అంశాలు

వివరాలు... 6లో

ఎస్పీగా ఈజీ అశోక్‌కుమార్

- నాడు డీఎస్పీగా పనిచేసిన చోటే ఎస్పీగా బాధ్యతలు
- అప్పట్లో రౌడీషీటర్లపై ఉక్కుపాదం



(కడప-ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడుగా పనిచేసి బెత్తం పట్టుకుని విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేశారు. అలాంటి వ్యక్తి బెత్తం బదులు లాఠీ పట్టుకుని లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి చేయాలని అనుకున్నారు. ఆ మేరకు గోల్ కోసం కష్టపడ్డారు. కడప డీఎస్పీగా వచ్చారు. రౌడీషీటర్ల బెండు తీయడంతో పాటు అప్పట్లో ఎర్రచందనం స్మగ్లింగ్‌లో డాన్‌లను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించారు. దాదాపు పదేళ్లకు డీఎస్పీగా పనిచేసిన చోటనే ఇప్పుడు ఎస్పీగా వస్తున్నారు. ఆయనే ఈజీ అశోక్‌కుమార్.

రాష్ట్రప్రభుత్వం సోమవారం రాత్రి పలువురు ఐపీఎస్‌లను బదిలీ చేయడంతో పాటు వెయిటింగ్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్ ఇచ్చింది. ఇందులో భాగంగా కడపకు అశోక్‌కుమార్‌ను ఎస్పీగా నియమించారు. కడపలో ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధన్‌రాజును గత ఏడాది నవంబరు 8న ప్రభుత్వం హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. అప్పటి నుంచి ఆయన పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారు. అయితే.. ఈ బదిలీల్లో హర్షవర్ధన్‌రాజుకు తిరిగి కీలకమైన తిరుపతిలో పోస్టింగ్ ఇవ్వడం గమనార్హం. ఇక హర్షవర్ధన్‌రాజు బదిలీతో అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు రెండు నెలలకు పైగా కడప జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా పనిచేస్తున్నారు. రెండు నెలలపాటు రెగ్యులర్ ఎస్పీ లేకపోవడంపై ఇటీవలే ఆంధ్రజ్యోతి ‘జిల్లాకు ఎస్పీ కావలెను..’ అనే కథనంతో పాటు సీఎం చంద్రబాబు జిల్లా పర్యటన రోజునా ఇదే విషయం ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబునాయుడు మైదుకూరు పర్యటన శనివారం ముగించుకుని రాష్ట్రంలో పరిశ్రమల పెట్టుబడుల కోసం దావోస్ వెళుతున్నప్పుడే ఐపీఎస్‌ల బదిలీలపై సంతకం చేశారంటారు.

మూడేళ్లు డీఎస్పీగా..

ఇంటెలిజెన్స్‌లో పనిచేస్తున్న ఈజీ అశోక్‌కుమార్‌ను కడప జిల్లా ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అశోక్‌కుమార్ 2014 నవంబరు 18 నుంచి 2017 ఆగస్టు 2వరకు కడప డీఎస్పీగా పనిచేశారు. అంతకు ముందు ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండేది. జిల్లాలో ఇష్టారాజ్యంగా ఎర్రచందనంతో పాటు కడపలో రౌడీరాజ్యం ఏలేది. అనంతరం విభజిత రాష్ట్రానికి చంద్రబాబు సీఎం అయ్యారు. ఆ సమయంలో అశోక్‌కుమార్ కడపకు డీఎస్పీగా వచ్చారు. అనతికాలంలోనే అప్పటి ఎస్పీల సహకారంతో కడపలో పేరొందిన రౌడీషీటర్ల బెండు తీశారు. ఇప్పుడు వివిధ పార్టీల్లో కీలకంగా ఉన్న నేతలకే అప్పట్లో ఆయన కోటింగ్ ఇచ్చారు. ఇక ఎర్రచందనంలో అంతర్జాతీయ డాన్‌లను పట్టుకొచ్చి తన మార్కు చూపించారు. ఇప్పుడు ఇదే జిల్లాకు ఎస్పీగా వస్తున్నారు.

కడపకు రావడం గర్వంగా ఉంది

- ఈజీ అశోక్‌కుమార్, నూతన ఎస్పీ

కడప జిల్లాకు మళ్లీ తిరిగి నేను ఎస్పీగా రావడం చాలా గర్వంగా ఉంది. కడప డీఎస్పీగా దాదాపు మూడేళ్లపాటు పనిచేశాను. కడప ప్రజల అభిమానాలు, అక్కడ స్థితిగతులు నాకు తెలుసు. కీలకమైన ముఖ్యమైన జిల్లాకు నన్ను ఎస్పీగా నియమించారు. మళ్లీ ఇక్కడకు రావడం సంతోషంగా ఉంది. జిల్లాలో శాంతిభద్రతల విషయంలో రాజీపడను. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు లక్ష్యానికి అనుగుణంగా శాంతిభద్రతలను కాపాడుతా. జనాలకు నిరంతరం భద్రతను కల్పిస్తాం. ప్రస్తుతం సైబర్ క్రైం సవాల్‌గా మారింది. దానిపై జనాల్లో అవగాహన తెస్తాం. సోషల్ మీడియాను మంచిగా వాడే విధంగా అవగాహన కల్పిస్తాం.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు : జేసీ



దివ్యాంగుని వద్దకు వచ్చి అర్జీ స్వీకరించి అతడితో మాట్లాడుతున్న జేసీ అదితిసింగ్

కడప కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలు తెలుసుకుంటూ, తదుపరి చర్యలకై సంబంధిత శాఖల అధికారులకు తక్షణ పరిష్కారం కోసం సిఫారసు చేశారు. ముందుగా జాయింట్ కలెక్టర్ పీజీఆర్ఎస్ నోడల్ అధికారి జడ్పీ సీఈవో ఓబులమ్మతో కలసి ప్రజా సమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరిస్తారనే ఆశతో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు వస్తారన్నారు. వాటికి సంబంధించి అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగా వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా తప్పక పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీలు స్వీకరించారు.

కాగా.. వికలాంగుల పెన్షన్, రేషన్ కార్డు కోసం బాషా, బాలాజీ కలెక్టరేట్ వద్దకు వచ్చారు. ఈ విషయం తెలిసి జేసీ బయటకు వచ్చి, దివ్యాంగునితో మాట్లాడి అధికారులను పిలిచి తక్షణమే సహాయం చేయాలని ఆదేశాలు జారీచేశారు. రాజుపాలెం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన మంగల లక్ష్మీనారాయణ ఫిర్యాదు చేస్తూ తమ అబ్బకు సర్వే నెంబకు 768లో 3.40ఎకరాలు ఉండేదని, ఆ భూమి గండికోట ప్రాజెక్టు మునక కింద అధికారులు తీసుకున్నారని, నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. రాజుపాలెం మండలం అరగడ వేముల గ్రామానికి చెందిన సరళ ఫిర్యాదు చేస్తూ జడ్పీ హైస్కూలులో ఆయా పోస్టులో తాను తిరిగి చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. తన తండ్రి కె.బాలాజీ సిద్దవటం మండలంలో ఎస్జీటీగా పనిచేస్తూ 2021లో మరణించారని, కారుణ్య నియమాకం కింద తనకు ఉద్యోగం ఇప్పించాలని పవన్‌రామ్ అభ్యర్థించారు. తాను నిరుపేదనని, తనను చౌకదుకాణం డీలరుగా నియమించి ఉపాధి కల్పించాలని రాజుపాలెం మండలం టంగుటూరు గ్రామానికి చెందిన ఆర్.మాధవి జేసికి విన్నవించారు. ఇలా వచ్చిన అనేక అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని అధికారులను జేసీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, వ్యవసాయ శాఖ ఏడీ నాగేశ్వరరావు, ఎస్డీసీ వెంకటపతి, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వాహనాల స్కామ్..!

- సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో అద్దెకు..
- మదనపల్లె కేంద్రంగా రవాణా
- కడప జిల్లాలో తాకట్టు..
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- సింఢికేట్‌గా.. నమ్మించి మోసం..


6



మదనపల్లెలో అద్దెకు వెళ్లే వాహనాలు

నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం

- రూ.5కోట్ల మేర నీటి పన్ను బకాయిలు
- అమృత్ నీటి పథకం రుణ భారం నెలకు రూ.70 లక్షలు
- పన్ను వసూళ్లపై దృష్టి పెట్టని అధికారులు
- అక్రమ కనెక్షన్లపై చర్యలు శూన్యం



ప్రొద్దుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ప్రజలకు నిత్యం తాగునీటిని సరఫరా చేయడానికి బడ్జెట్‌లో కోట్ల రూపాయల ప్రజాధనం ఖర్చు పెడుతుంటారు. కానీ నీటి పన్ను వసూళ్లలో మాత్రం నిలువెత్తు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. దీంతో ఖర్చు మోపెడు ఆదాయం చారెడు అన్న చందంగా తయారైంది. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో రెండు లక్షలకు పైగా జనాభా ఉంది. 33,290 ఇంటి పన్నుల అసెస్‌మెంట్లు, 23,843 నీటి పన్ను అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఏడాదికి నీటిపన్ను ద్వారా వచ్చే ఆదాయం కేవలం రూ.2.78 కోట్లు. ఖర్చు మాత్రం ఆదాయం కంటే రెండు రెట్లు ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు నీటి పన్ను బకాయిలు ఏడాదికి ఏడాది పెరిగిపోతున్నాయి. ఇప్పటి వరకు ఉన్న బకాయిల్లో రూ.6.41 కోట్లకుగాను రూ.1.38 కోట్లు వసూళ్లు చేశారు. ఇంకా రూ.5.03 కోట్ల బకాయిలు పేరుకుపోయాయి. ఇందులో కరెంట్ డిమాండ్ రూ.2.78 కోట్లు కాగా అరియర్స్ రూ.3.61 కోట్లు.

అమృత్ నీటి పథకం రుణ చెల్లింపులకు రూ.70 లక్షలు

అమృత్ స్కీం కింద చేపట్టిన తాగునీటి పథకం ప్రొద్దుటూరు మున్సిపాలిటీకి ఆర్థిక భారంగా మారింది. రూ.151.38 కోట్లతో చేపట్టిన అమృత్ స్కీంలో కేంద్రం రూ.38.58 కోట్లు, రాష్ట్రం రూ.15.29 కోట్లు కాగా మున్సిపాలిటీ వాటాగా రూ.97.51 కోట్లు ఖర్చుపెట్టారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీ వద్ద నిధులు లేకపోవడంతో 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల నుంచి దాదాపు రూ.43కోట్ల మేర ఖర్చు పెట్టగా.. తక్కిన మొత్తం రూ.54.74 కోట్లు పంజాబ్ నేషనల్ బ్యాంకు నుంచి రుణం తీసుకుని అమృత్ స్కీంను పూర్తి చేశారు. కానీ ఈ రుణానికి నెలకు ఈఎంఐ కింద రూ.35 లక్షలు, వడ్డీ కింద మరో రూ.35లక్షలు వెరసి నెలకు రూ.70 లక్షల మేర చెల్లించాల్సి వస్తోంది. దీనికి తోడు నిరంతరం నీటి సరఫరా విభాగంలో ఉన్న రెగ్యులర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు, మెయింటనెన్సు ఖర్చులు కూడా ఏడాదికి రూ.కోట్లలో ఉన్నాయి. కాగా.. నిత్యం ఇంటింటికి నీటి సరఫరా చేయడానికి రూ.కోట్లు వ్యయం అవుతున్న విషయం ప్రజలకు వివరించి.. నీటి పన్నులు రాబట్టాల్సి ఉంది.

అక్రమ కనెక్షన్లపై చర్యలు శూన్యం

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నుల అసెస్‌మెంట్లు 33,290 ఉన్నాయి. నీటి కనెక్షన్లు 23,943 మాత్రమే ఉన్నాయి. దీన్ని బట్టి వేల సంఖ్యలో నీటి కనెక్షన్లు అక్రమంగా ఉంటున్నాయి. వీటికి సంబంధించి గతంలో అధికారులు చర్యలు మొదలు పెట్టి కొన్నింటిని గుర్తించి వాటిని రెగ్యులర్ చేసుకోవడానికి గడువు ఇచ్చారు. కొంతమంది రెగ్యులర్ చేసుకున్నా చాలామంది అక్రమంగా నీటి కొళాయిలు కొనసాగిస్తున్నారు. గతంలో నీటి కనెక్షన్లు రూ.10 డిపాజిట్ మొదలు రూ.200 డిపాజిట్ కనెక్షన్ల వరకు అనేకం అక్రమంగా ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపార సముదాయాలకు కమర్షియల్ కనెక్షన్లు బదులు రెసిడెన్సియల్ కనెక్షన్లు ఇచ్చారు. రూ.200 రూపాయల డిపాజిట్‌తో పేదలకు ఇచ్చిన కనెక్షన్లకు కేవలం రూ.60 మాత్రమే నెలకు పన్ను ఉంది. కానీ వారు నిజంగా పేదలేనా.. అవి పూరి గుడిసెలేనా లేక భవనాలా అనేది పరిశీలించాల్సిన అవసరం ఉంది. రూ.10 వేల డిపాజిట్ తీసుకున్న వారికి పన్ను రూ.100 ఉంటోంది. రూ.10, రూ.200 డిపాజిట్లతో ఇచ్చిన కనెక్షన్లపై ఇప్పటికైనా ప్రత్యేక విచారణ టీంలను వేసి అక్రమాలను గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రుణభారం మోస్తున్నా..

ఒకవైపు నీటి సరఫరా కోసం నెలనెల రూ.70లక్షలు బ్యాంకు రుణం చెల్లిస్తూ మరోవైపు ఉద్యోగుల జీతాలు, కరెంటు బిల్లులు మెయింటెనెన్సు ఖర్చులు నెలకు రూ.50 లక్షలు వెచ్చిస్తూ ఆర్థిక రుణ భారం మోస్తున్నా.. పన్ను వసూళ్లలో మాత్రం అధికారులు సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. 45 సచివాలయాల పరిధిలో వందలాది మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నా మున్సిపల్ అధికారులు నీటి పన్ను వసూళ్లలో అలక్ష్యం ప్రదర్శిస్తున్నారు. నీటి కనెక్షన్లు అన్నింటిని పరిశీలించి పన్ను పరిధిలోకి తేవడంతో పాటు నీటిపన్నులు వసూళ్లు చేసి మున్సిపాలిటీ ఆర్థిక వనరులు సమీకరించుకోకుంటే భవిష్యత్తులో నీటి సరఫరాకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందని కొందరు మున్సిపల్ ఉద్యోగులు అభిప్రాయ పడుతున్నారు.

నీటి పన్నులు రాబడుతున్నాం..

నీటిపన్ను వసూళ్లకు స్పెషల్‌టీంలు వేశాం. పది వార్డులకు మున్సిపల్ ఏఈ, డీఈలకు మానిటరింగ్ చేయమని ఆదేశాలిచ్చాం. వార్డు అమినిటీస్ సెక్రటరీలకు ప్రతిరోజు 60 వేల వంతున నీటిపన్ను కలెక్షన్ టార్గెట్ ఇచ్చాం. వారానికి నాలుగు లక్షలు వంతున వసూళ్లు చేయాలని టార్గెట్ ఇచ్చాం. అలాగే అక్రమ కొళాయి కనెక్షన్లపై కూడా చర్యలుతీసుకుంటాం. గతంలో రూ.10, రూ.200 డిపాజిట్‌తో ఇచ్చిన కనెక్షన్లను పరిశీలిస్తాం. వాటికి డిపాజిట్ మొత్తం పెంచి కౌన్సిల్ అనుమతితో వసూళ్లు చేస్తాం.

- వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి



మృతిచెందిన యువకుడు

పెద్దమండ్యం, జనవరి 20(ఆంధ్రజ్యోతి) అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన పెద్దమండ్యం మండలం కలిచెర్లలో సోమవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కలిచెర్ల గ్రామానికి చెందిన షేక్ ఖాదర్‌షరీఫ్ చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి తోడుగా ఉంటున్న ఆయన కుమారుడు ఉస్మాన్ (20) ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కలిచెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక సమీపంలో ఉన్న చింతచెట్టు కింద సోమవారం అనుమానాస్పద స్థితిలో శవమై పడివున్నట్లు గ్రామస్థులు కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు పెద్దమండ్యం పోలీసులకు సమాచారం అందించగా వారు సంఘటనా స్థలంలో వున్న ఉస్మాన్ మృతదేహాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి అతిగా మద్యం తాగి మృతి చెంది ఉంటాడని పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శవ పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ రమణ తెలిపారు. మృతుడి తండ్రి ఖాదర్‌షరీఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉదయగిరిలో రాజంపేట వాసి మృతి



మృతిచెందిన శంకరయ్య

ఉదయగిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా ఉదయగిరి పట్టణంలో సోమవారం రాజంపేటకు చెందిన శంకరయ్య మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. శంకరయ్య రెండేళ్లుగా ఉదయగిరిలో ప్లాస్టిక్ సామగ్రి, చిత్తు కాగితాలు పోగు చేసి విక్రయించి జీవిస్తున్నాడు. స్థానిక ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న పాత సామాన్లు కొనుగోలు చేసే దుకాణం వద్దే నివసిస్తున్నాడు. అక్కడే సోమవారం మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. శంకరయ్య రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, అతనికి మద్యం అలవాటు కూడా ఉందని స్థానికులు తెలిపారు. ఎస్ఐ శ్రీనివాసులు మృతదేహాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సిద్దవటం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం సమీపాన నేషనల్ హైవేపై జనవరి 15న రాత్రి గుర్తు తెలియని వ్యక్తిని(50) ఓ వాహనం ఢీకొనడంతో అతనికి బలమైన గాయాలయ్యాయి. దీంతో స్థానికులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు 108 వాహనంలో మెరుగైన వైద్యం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కాగా చికిత్స తీసుకుంటూ సోమవారం ఉదయం మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించడంతో మార్చురీకి తరలించామని స్థానిక పోలీసులు తెలిపారు. ఎవరైనా మృతిచెందిన వ్యక్తిని బంధువులు గుర్తుపడితే వెంటనే రావాలని పోలీసులు తెలియజేశారు.

కోడిపందేల నిర్వహణపై ఎస్‌బీ పోలీసుల విచారణ

కురబలకోట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదివేడు సమీపంలో జోరుగా కోడిపందేలను బహిరంగంగా ఆదివారం నిర్వహించడంపై ఎస్‌బీ పోలీసులు విచారణ చేపట్టారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోమవారం 'జోరుగా కోడి పందేలు' శీర్షికన వార్త ప్రచురితమైంది. దీనిపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎస్‌బీ అధికారులను ఆదేశించడంతో ఆ మేరకు విచారణ చేపట్టారు. దీంతో ముదివేడు చుట్టుపక్కల విచారించి నివేదికను ఎస్పీకి అందజేశారు.

శిబ్యాల పంచాయతీ కార్యదర్శి బదిలీ

కలికిరి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శి కాశెట్టి నాగరాజ రాజు గుంటూరుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులిచ్చింది. తగు చర్యలు తీసుకొనేందుకు పంచాయతీ రాజ్ కమిషనర్‌ను ప్రభుత్వం అనుమతించింది. బదిలీలపై ప్రస్తుతం అమల్లో నిషేధాన్ని సడలిస్తూ మానవతా దృక్పథంతో చేసిన ఈ బదిలీకి సంబంధించిన ఉత్తర్వును పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీవో జారీ చేశారు.

రేపు కబడ్డీ జట్ల ఎంపికలు

కడప స్పోర్ట్స్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రాజీవ్‌మార్గ్ రోడ్డులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22 బుధవారం ఉదయం సీనియర్స్ మహిళల..పురుషుల కబడ్డీ జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గోవర్ధన్‌రెడ్డి, జనార్ధన్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి వుంటుందన్నారు.

వాహనాల స్కామ్..!



బైపాస్ రోడ్డులో అమ్మకానికి సిద్ధం చేసిన వాహనాలు

రోజురోజుకు వాహనాల స్కామ్ ఎక్కువవుతోంది. మదనపల్లెకు చెందిన కొందరు ఓ ముఠాగా ఏర్పడి ఈ తతంగం నడిపిస్తున్నట్లు సమాచారం. సెల్ఫ్ డ్రైవింగ్ పేరుతో కార్లను అద్దెకు తీసుకొని.. ఆపై ఉడాయిస్తున్నారు. ఆ వాహనాలను తాకట్టు పెట్టి సొమ్ము చేసుకుంటూ ఎంజాయ్ చేస్తున్నారు. మదనపల్లె కేంద్రంగా ఇదంతా జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాహన యజమాని బాడుగ వస్తే చాలని ఎవరికి పడితే వారికి అద్దెకు ఇవ్వడంతో ఈ మోసాలు జరుగుతున్నట్లు చెబుతున్నారు. చివరకు బాధితులు చేసేది లేక పోలీసులను ఆశ్రయిస్తూ లబోదిబోమంటున్నారు.

- సెల్ఫ్‌డ్రైవింగ్ పేరుతో అద్దెకు..
- మదనపల్లె కేంద్రంగా రవాణా
- కడప జిల్లాలో తాకట్టు..
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- సిండికేట్‌గా.. నమ్మించి మోసం..

మదనపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇదో కొత్త రకమైన వాహనాల స్కామ్. మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి వాహన యజమానులు, వాహనాల పార్కింగ్ కేంద్రాలు, ట్రావెల్స్ నుంచి కారు, సుమో, ఇన్నోవా, స్కార్పియో, తదితర రకాల వాహనాలను రోజువారీ, నెలవారీ అద్దెకు తీసుకుంటున్నారు. సెల్ఫ్ డ్రైవింగ్‌తో పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంజనీరింగ్ పనుల వద్ద సైట్లలో, తదితర రకాల పేరుతో అద్దెకు తీసుకుంటారు. మొదట్లో రెండు, మూడు రోజులు అద్దె చెల్లిస్తారు. ఇంకా అవసరమైతే.. టూర్, ఇతర అవసరాల పేరుతో వారం, పదిహేను రోజులు పొడిగిస్తారు. అనంతరం అవసరాన్ని బట్టి బయటి ప్రాంతంలో ఒక్కో వాహనాన్ని రూ.లక్ష నుంచి రూ.2 లక్షలకు తాకట్టు పెట్టి రుణం తీసుకుంటున్నారు. రుణదాతలకు వడ్డీ చెల్లిస్తూ, వీటిని ష్యూరిటీగా పెడుతున్నారు. పని కాగానే, అప్పు చెల్లించి వాహనాన్ని రిలీజ్ చేసుకుంటున్నట్లు చెబుతున్నారు. అయితే తాము అనుకున్న పని కానప్పుడు సీన్ రివర్స్ అవుతోంది. దీంతో యజమానికి సమాధానం చెప్పలేక చివరకు కటకటాల పాలవుతున్నారు. ఆ లోగా వాహనం జాడ యజమానికి తెలిస్తే, బంధువులు లేక అయిన వారో తీసుకెళ్లారని బుకాయిస్తారు. అప్పటికీ వాహనం ఇంటికి రాకుంటే పోలీసులను ఆశ్రయించి, వాహనం చోరీ అయిందనో లేక అద్దె పేరుతో తీసుకెళ్లి పరారయ్యాడని పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నారు.

మదనపల్లెకు చెందిన కొందరు వ్యక్తులు మదనపల్లె, బి.కొత్తకోట, వాల్మీకిపురం, పీలేరు ఏరియాలలో రోజువారీ అద్దెకు, నెలవారీ బాడుగ పేరుతో తీసుకెళ్లి కడప జిల్లా చక్రాయపేట, గండి, వేంపల్లె, ప్రొద్దుటూరు, పులివెందుల, తదితర ప్రాంతాల్లో తాకట్టు పెడుతున్నారు. మదనపల్లె కేంద్రంగా కొన్నేళ్లుగా కొనసాగుతున్న దందాలో ఎక్కడో ఇటీవల బెడిసికొట్టడంతో వెలుగులోకి వచ్చింది. అలాగే హైదరాబాద్ కేంద్రంగా కూడా అక్కడి ఏజెంట్లు మదనపల్లెకు తెచ్చి ఇలాంటి అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఇటీవల బయటపడింది. కేసులు, పోలీసుల వరకూ వెళ్లినవి కొన్నే అయితే, వెలుగులోకి రానివి మరెన్నో ఉన్నట్లు వాహన, ట్రాన్స్‌పోర్టు యజమానులు చెబుతున్నారు.



మదనపల్లెలోని ఓ పార్కింగ్ కేంద్రంలోని వాహనాలు

మదనపల్లెకు చెందిన ముగ్గురు వాహన యజమానులు వారం రోజుల క్రితం తమ వాహనాలు కనిపించలేదని తాలూకా పోలీసులను ఆశ్రయించారు. చివరకు వాహనాల జాడ తెలుసుకున్న బాధితులు.. పోలీసులతో కలిసి 20 మంది యువకులు రెండు వాహనాల్లో కడప జిల్లా చక్రాయపేటకు వెళ్లారు. అక్కడ వారి వాహనాలు కలిగి ఉన్న వ్యక్తులను ప్రశ్నిస్తే మదనపల్లెకు చెందిన ఓ వ్యక్తి తమకు తాకట్టు పెట్టాడని తెలిపారు. ఆ వాహనాలు తమవని మీరెలా తాకట్టు పెట్టుకుంటారని ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన వాహన రికార్డులను వాహన యజమానులు చూపిస్తే, తాకట్టు పెట్టుకున్నట్లు మధ్యవర్తి ద్వారా రాయించుకున్న రికార్డులు వారూ చూపించారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య మాటామాటా పెరిగి వాగ్వాదానికి దారితీసింది. ఈ విషయం చక్రాయపేట మండలంలో దావానంలా వ్యాపించింది. ఈ క్రమంలో ఇలాంటి అద్దె వాహనాలను తాకట్టు పెట్టుకున్న వారంతా ఏకమయ్యారు. చివరికి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో ఈ పంచాయితీ కాస్త అక్కడి చక్రాయపేట పోలీస్‌స్టేషన్‌కు చేరింది. మీకు వాహనాలు ఇచ్చేది లేదని, మీరు ఎవరికి అద్దెకు ఇచ్చారో వారిని తీసుకురావాలని పట్టుబట్టారు. మీకు బండ్లు ఇస్తే.. మేం ఇచ్చిన డబ్బులు ఎవరిస్తారని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితిల్లోనూ వాహనాలు ఇవ్వమని తెగేసి చెప్పారు. చివరకు వాహనాలు అక్కడి పోలీస్‌స్టేషన్‌లో పెట్టడంతో మదనపల్లె నుంచి వెళ్లిన 20 మందితో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్ తిరిగి ఖాళీగా మదనపల్లెకు వచ్చేశారు. ఇదిలా వుండగా పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి తీసుకెళ్లిన 67 వాహనాలను కడప జిల్లా చక్రాయపేట, తదితర ప్రాంతాలకు రవాణా చేశారంటే.. వాహనాల స్కాం ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం చేసుకోవచ్చు.

చక్రాయపేట మండలంలోని కుప్పగుట్టపల్లె, నాగులగుట్టపల్లె, చిలేకాంపల్లె, దేవరగుట్టపల్లె, తదితర గ్రామాల్లో తాకట్టు పెట్టిన వాహనాల్లో మూడింటిని రుణదాతలకు తెలియకుండా మధ్యవర్తులు దొంగగా తెచ్చేసినట్లు చెబుతున్నారు. తాము ఎక్కడెక్కడ, ఎవరెవరికి వాహనం ఇచ్చిందీ వారికి తెలుసు. ఈ నేపథ్యంలో వాహనం ఎక్కడ తిరుగుతోందో, రాత్రివేళలో ఎక్కడ పార్కింగ్ చేస్తారో జీపీఎస్ ట్రాక్ ద్వారా ముందుగానే పసిగడతారు. అసలే చలికాలం.. రాత్రివేళలో ఇంట్లో నిద్రిస్తున్న వేళ అప్పటికే తమ వద్ద సిద్ధంగా ఉంచుకున్న రెండో కీ ద్వారా తెచ్చేస్తున్నారు. తెల్లవారి చూసుకున్న బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పటి వరకూ జీపీఎస్ ట్రాక్ విషయం తెలియని వారంతా.. అలెర్ట్ అయ్యారు. తాకట్టు పెట్టుకున్న మిగిలిన వాహనాలను మెకానిక్ వద్దకు తీసుకెళ్లి, ట్రాకింగ్ సిస్టమ్‌ను తీసేస్తున్నారు. ఇలా ఒకదాని తర్వాత మరొకటి బయట పడుతుండటంతో వారూ అలెర్ట్ అయ్యారు. వారూ తమ డబ్బులు వచ్చేంత వరకూ వాహనాలను ఊర్లేకాదు.. జిల్లాలను దాటిచ్చేస్తున్నట్లు సమాచారం.

తక్కువకు వస్తోందని..

రూ.5 లక్షలు, రూ.10 లక్షలు విలువ చేసే వాహనం రూ.లక్ష, రూ.లక్షన్నరకు తాకట్టు పెడుతుండటంతో డ్రైవింగ్ నేర్చుకునే, సరదాగా టూర్‌వెళ్లే, హోదాకు చిహ్నంగా భావించే.. ఇలా ఒకరిని చూసి మరొకరు వాహనాలను తీసుకున్నట్లు చెబుతున్నారు. తక్కువ ధరకు రావడం, కొందరైతే వడ్డీకి ఇచ్చే సొమ్ములకు ష్యూరిటీగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. కొన్నిచోట్ల వాహన యజమాని, మీడియేటర్ ముఠాగా ఏర్పడుతున్నారు. వాహనాన్ని మూడో వ్యక్తికి తాకట్టు పెట్టి, వాహనం చోరీ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేస్తారు. ఆలోగా మధ్యవర్తి కనిపించకుండా పోవడం, కేసుల భయంతో డబ్బులిచ్చిన వారు మాత్రం.. కేసు లేకుండా వాహనం వదిలేయాల్సిన పరిస్థితి కూడా ఉంటోంది. తాకట్టు సొమ్మును మధ్యవర్తి, వాహన యజమాని పంచుకుంటున్నట్లు కూడా చెబుతున్నారు. అలాగే కొన్నిచోట్ల చోరీ, రికార్డులు లేని వాహనాలు వచ్చిన కాడికి రానిలే అన్నట్లు ఎంతో కొంతకు మార్టిగేజ్ పెట్టేసి సొమ్ములు తీసుకుంటున్న ఉదంతాలు కూడా ఉన్నాయి.

సీన్ కట్ చేస్తే.. వాల్మీకిపురంలో..

తమకు వచ్చిన ఫిర్యాదులపై తాలూకా పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, ఇదే తరహాలో వాల్మీకిపురం నుంచి కూడా వాహనాలను అద్దెకు తీసుకెళ్లి చక్రాయపేట మండలంలో తాకట్టు పెట్టినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై వాల్మీకిపురం పోలీసులు కేసు నమోదు చేసి, నిందితులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వారిచ్చిన సమాచారం మేరకు చక్రాయపేటకు వెళ్లి, అక్కడ తాకట్టు పెట్టిన వాహనాలను తీసుకొచ్చారు. ఇలా వాహనాలను ఎక్కడెక్కడ అద్దెకు తెచ్చారో, ఎక్కడ తాకట్టు పెట్టారో పోలీసులు విచారణ చేస్తున్నారు. అయితే ఇలా అద్దె వాహనాలను తాకట్టు పెట్టే ముఠాతో పోలీసులకు సంబంధాలు ఉన్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. కొన్ని కేసుల్లో వీరినే పోలీసులు ఇన్‌ఫార్మర్లుగా వాడుకుంటున్నట్లు చెబుతున్నారు.

పొలానికి వెళ్లి తిరిగి వస్తూ.. అనంత లోకాలకు

- ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు
- ఒకరు మృతి, మరొకరికి గాయాలు



బోల్తాపడిన ట్రాక్టర్, రోడ్డు సైడుకు దూసుకెళ్లిన కారు

సంబేపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వారు ఇద్దరూ అన్నదమ్ములు. సొంత ట్రాక్టర్ తీసుకొని పొలం దున్నకాలకు వెళ్లారు. పనులు ముగించుకొని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు ఖాదర్‌వల్లి (25)ని కబలించింది. అతని సోదరుడు సాయిపీర్ తీవ్రగాయాలతో కాలు విరిగిన సంఘటన చోటు చేసుకుంది. సంబేపల్లె మండలం దేవపట్ల గ్రామం కట్టుగుత్తపల్లెకు చెందిన ఖాదర్‌వల్లి, సాయిపీర్ ఇరువురూ సోమవారం ఉదయం సదుం సమీ పంలో పొలం దున్నకాలకు వెళ్లినట్లు తెలిపారు. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో వస్తూ ఉండగా కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి గుట్టపల్లి సమీపంలో రాగానే కలకడ వైపు నుంచి వస్తున్న కారు ట్రాక్టర్‌ను వెనుకభాగంలో ఢీకొనడంతో ట్రాక్టరు బోల్తాపడింది. కారు రోడ్డు సైడ్ దిగింది. కారులో ఉన్న వ్యక్తులకు స్వల్పగాయాలు కాగా ట్రాక్టర్‌లో ఉన్న అన్నదమ్ములు ఇరువురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి కాలు విరిగి రక్తగాయాలైనట్లు తెలిపారు. స్థానికులు మృతుని కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందజేయడంతో ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నట్లు తెలిపారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో మృతుని బంధువులు, కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

పొలంలో బయటపడ్డ పురాతన విగ్రహాలు



పురాతన విగ్రహాలు

తంబళ్లపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోటకొండలో ఓ రైతు పొలంలో రెండు పురాతన రాతి దేవతా విగ్రహాలు బయటపడ్డాయి. గ్రామస్థులు వివరాల మేరకు... తంబళ్లపల్లె మండలం కోటకొండ పంచాయతీ మద్దిరాలపల్లె సమీపంలో ఎస్.రంగారావుకు చెందిన భూమిని ఇదే పంచాయతీ ఏటిగడ్డపల్లెకు చెందిన వెంకటేష్ కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం టమోటా నాటేందుకు భూమిని ట్రాక్టర్‌తో దుక్కి దున్నించాడు. సోమవారం ఉదయం దుక్కి దున్నిన పొలంలో రైతు నడుచుకుని వెళుతుండగా ఎత్తుగా రాయి ఉన్నట్లు కనిపించింది. దీంతో వెంటనే రాయిని వెలికితీసి పరిశీలించగా సుమారు ఒకటిన్నర అడుగు పొడవు, అడుగు వెడల్పు ఉన్న రెండు రాతి విగ్రహాలు బయల్పడ్డాయి. ఇందులో ఒక విగ్రహం రామానుజాచార్యులది కాగా, మరో విగ్రహం అమ్మవారిది ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయం గ్రామస్థులకు తెలియడంతో తండోప తండాలుగా వెళ్లి విగ్రహాలను ఆసక్తిగా తిలకించారు. విగ్రహాలను శుభ్రపరచి పసుపు పూసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కాగా, విగ్రహాలు బయటపడిన పొలానికి సమీపంలో పూర్వం ఓ చిన్న చెరువు ఉండేదని, అప్పట్లో కురిసిన వర్షాలకు ఆ చెరువు కట్ట తెగిపోయి కిందనే ఉన్న ఆలయంపై మట్టి పడి అందులో ఉన్న విగ్రహాలు పూడిపోయి ఉంటాయని గ్రామస్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలు సుమారు 300 ఏళ్ల క్రితం నాటివి ఉండవచ్చని గ్రామస్తులు అనుకుంటున్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

మదనపల్లెఅర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలుకా సీఐ కళా వెంకటరమణ వివరాల మేరకు.. మదనపల్లె మండలం, టేకులపాలెంకు చెందిన నరసింహులు (42) సోమవారం ఉరివేసుకుని మృతి చెందాడు. ఆరునెలల క్రితం భార్య తులసీ కుటుంబ కలహాలతో పుట్టిల్లు కోళ్లవారిపల్లెకు వెళ్లి తిరిగి కాపురానికి రాలేదని మనస్తాపానికి గురై సోమవారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించే లోపే మృతి చెందాడని, వెంటనే మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు తాలుకా సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

మైదుకూరురూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం అక్రమరవాణాకు సిద్ధంగా ఉంచిన ఎర్రచందనం దుంగలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు డీఆర్‌ఓ అన్వర్‌హుస్సేన్ తెలిపారు. జిల్లా అటవీ శాఖాధికారి వినీత్‌కుమార్ ఆదేశాల మేరకు వనిపెంట సమీపంలోని నల్లమల అడవిలో ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. రవాణాకు సిద్ధంగా ఉంచిన 8 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అదుపులోకి తీసుకోగా.. కొందరు పారిపోయినట్లు తెలిపారు. నిందితుల పేర్లు, వారి సమాచారం గోప్యంగా ఉంచారు. కార్యక్రమంలో వనిపెంట ఫారెస్ట్ రేంజర్ ప్రణీత్ రావు, అన్వర్‌హుస్సేన్, బీట్ ఆఫీసర్లు సుచరిత, గంగాధర్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకొన్న ఫారెస్ట్ అధికారులు

'అయ్యో'ర్లపై రాఘవరెడ్డి తిట్ల దండకం

- నోరు తెరిస్తే బూతులు, దుర్భాషలు
- తన ప్రాపకముంటే ప్రమోషన్ లేదంటే సస్పెన్షన్
- ప్రభుత్వమిచ్చిన నోటీసులో విస్మయం కలిగించే అంశాలు

కలికిరి, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): "అరె.. యూస్‌లెస్ ఫెలో.. పనికిమాలిన గాడిద కొడకా.. అరె మెంటల్.." ఈ తిట్లు పడ్డవారు ఎవరో కాదు సాక్షాత్తు గౌరవప్రదమైన వృత్తిలో వున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు. తిట్టిన వారెవరో కాదు.. వై.రాఘవరెడ్డి. కడప జిల్లా కేంద్రంగా డీఈవోగా, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడిగా ఉన్నత స్థాయిలో పనిచేస్తూ విద్యా వ్యవస్థను పర్యవేక్షించాల్సిన అధికారి. ఇవన్నీ కల్పిత ఫిర్యాదులు కూడా కావు. సాక్షాత్తు రాష్ట్ర గవర్నరుకు అందిన ఫిర్యాదుపై ఇద్దరు రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు కూలంకషంగా విచారణ చేసి రుజువులతో సహా తేల్చిన నిజాలు. ఈ విషయాలన్నిటిని కూడా సాక్షాత్తు ప్రభుత్వమే వెల్లడించింది. రాఘవరెడ్డిపై వచ్చిన అభియోగాల గురించి ప్రభుత్వ పరంగా విచారణ జరపడం కోసం ఆదివారం ఆయనకు జారీ చేసిన నోటీసులో విస్తుగొలిపే పలు అంశాలున్నాయి. అవి యథాతథంగా.. నందలూరు మండలం పొత్తపి పాఠశాల ఉపాధ్యాయుడు ఎం.వెంకట్రమణకు ఫోను చేసి "యూస్‌లెస్ ఫెలో, పనికిమాలిన గాడిద కొడకా, మెంటలా.. చట్ట విరుద్ధంగా పనిచేస్తున్నావు.. మెంటలా" అంటూ దుర్భాషలాడాడు. తరువాత అదే స్కూల్లో పనిచేసే ఆయన భార్యతో అతడికి అన్నం పెట్టొద్దు. పిల్లలను జాగ్రత్తగా చూసుకోమంటూ సలహా ఇచ్చాడు. రాష్ట్ర ఎస్‌సీఈఆర్టీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి కేశవరెడ్డికి ఫోను చేసి గాడిదనాకొడకా అంటూ దూషించాడు. ఇక కడపలోని చంద్రమౌళి విద్యాలయం కరస్పాండెంట్‌ను చెప్పలేని భాషలో దురుసుగా మాట్లాడాడు.

పరిపాలనాపరమైన అక్రమాలు

ఇవన్నీ ఒక కోణంలోనివి కాగా పాలనాపరమైన పలు అంశాల్లో ఆయన నియమాలను అతిక్రమించి వ్యవహరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. లింగాల మండల వెలిదండ్ల పాఠశాల హెచ్‌ఎం బి.మురళీకృష్ణకు నాడు-నేడు పనులతో ఎలాంటి సంబంధం లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశాడు. నాగులగుట్టపల్లె టీచర్ ఎస్.రామమోహన్ ఒక ఆర్టీసీ డ్రైవర్ గొడవపడిన కారణంగా సస్పెండ్ చేశాడు. వాస్తవానికి ఇది పూర్తిగా ప్రైవేటు వ్యవహారం. కనీసం దీనిపై పోలీసు స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ కూడా లేదు. సస్పెండ్ చేయాలంటే కేసు నమోదై కనీసం 48 గంటలు పోలీసుల కస్టడీలో వుండాలి. అయినా సస్పెండ్ చేయడం విరుద్ధమంటూ ప్రభుత్వం పేర్కొంది. ఇక ఒక ఉన్నతాధికారిగా అనేక నియమాలను అతిక్రమించారనేది మరి కొన్ని ఆరోపణలు. పుల్లంపేట మండలం రామసముద్రం హెచ్‌ఎం పి.పొట్టిరెడ్డిని ఆయన అభ్యర్థనపై నియమ విరుద్ధంగా 16 శాతం ఇంటి అద్దె అలవెన్సు వచ్చే విధంగా బదిలీ చేశాడు. అదే విధంగా 16 శాతం హెచ్‌ఆర్‌ఏ కోసం రాజంపేట మండలం పలపుత్తూరు హెచ్‌ఎం వై.హేమలతను కంచర్లపల్లెకు, మరో హెచ్‌ఎం బి.ఆనందనాయక్‌ను పుల్లంపేట మండలం రెడ్డిపల్లె నుంచి రాయచోటికి, వై.సుశీలను వీరబల్లి మండలం లగ్గిశెట్టిపల్లె నుంచి పదోన్నతి మీద కుమ్మరపల్లెకు బదిలీ చేశారు. పెనగలూరు నుంచి వి.వెంకటేశ్వర్లును కౌన్సెలింగ్‌లో ఖాళీ లేకున్నా బెదిరించి జి.కె.రాచపల్లెకు బదిలీ చేశారు. కౌన్సెలింగ్‌లో అదనపు పాయింట్ల కోసం తప్పులు చేసిన కలసపాడు మండలం ఎగువరామాపురం టీచర్ అర్లి విజయలక్ష్మిపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోకుండా అలసత్వం వహించాడు. అదే విధంగా అదే పాఠశాలకు చెందిన హెచ్‌ఎం మస్తాన్‌వల్లిపై ఉన్నతాధికారులకు నివేదిక పంపకుండా నిర్లక్ష్యం వహించాడు. కౌన్సెలింగ్‌కు హాజరుకాకపోయినా పట్టణ ప్రాంతంలో నియమించాడు. చెన్నూరు మండలం దౌలత్‌పురం టీచరు కె.రమణారెడ్డిని కన్సిస్టెంట్ రెయిమ్స్ నోడల్ అధికారిగా, కడప అశోక్‌నగర్‌కు చెందిన రమేష్‌బాబును స్కూల్ సేఫ్టీ జిల్లా మానిటరింగ్ అధికారిగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండానే నియమించారు. కౌన్సెలింగ్ కోసం తప్పుడు వివరాలు సమర్పించిన వారిని ప్రాసిక్యూషన్ చేయాలనే నిబంధన లున్నా వారిని కనీసం ఖాళీలున్న మారుమూల ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వున్నా పట్టించుకోకపోవడం వంటి అభియోగాలతో రాఘవరెడ్డిపై ప్రభుత్వం విచారణకు సిద్ధమవుతోంది. పది రోజుల్లోగా ఆయన నుంచి సంజాయిషీ అందిన అనంతరం తగు చర్యలు తీసుకోనున్నారు. కాగా రాఘవరెడ్డి వ్యవహారశైలి గురించి ప్రభుత్వం ఆపాదించిన అభియోగాల గురించి జిల్లాల్లోని ఉపాధ్యాయ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది.

పారదర్శక సేవలు... ప్రగతికి అడుగులు

- స్వర్ణ పంచాయతీ పేరిట కూటమి సర్కార్ శ్రీకారం
- గ్రామాల ఆదాయ వనరులు నమోదు
- అందుబాటులోకి వస్తే పౌరసేవలు సులభతరం


వెబ్‌సైట్‌లో వివరాలను పరిశీలిస్తున్న ఈవోపీఆర్డీ రామాంజనేయులరెడ్డి, కార్యదర్శి తేజశ్విని

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. ఇకపై ప్రతి చెల్లింపు ఆన్‌లైన్‌లో నిర్వహించేలా డిజిటలైజేషన్ చేస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో పారదర్శకత, జవాబుదారితనం పెరగనుంది. వివరాల్లోకి వెళితే..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలు నిర్వీర్యం అయ్యాయి. ఎటువంటి అభివృద్ధి పనులకు నోచుకోలేదు. మౌలిక వసతుల కల్పన కుంటుపడింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం గ్రామాల సుస్థిరాభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. పంచాయతీల్లో అక్రమాల నిరోధానికి చర్యలు చేపడుతోంది. ప్రజలకు పారదర్శకంగా సమాచారం, సేవలు అందించేందుకు వీలుగా 'స్వర్ణ పంచాయతీ' వెబ్‌సైట్‌కు రూపకల్పన చేశారు. డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. దీని ద్వారా ఎక్కడ ఉన్నా పన్నులు సకాలంలో చెల్లించే వెసులుబాటు కల్పించనున్నారు. ఇందుకుగాను స్వర్ణ గ్రామ పంచాయతీ వెబ్‌సైట్ అందుబాటులో ఉంచారు. దీని ద్వారా ప్రజలకు సేవలు సులభతరం కానున్నాయి.

అక్రమాలకు అడ్డుకట్ట

పంచాయతీల్లో పన్నుల రూపంలో వచ్చిన ఆదాయానికి గండికొట్టకుండా డిజిటల్ విధానం ఉపయోగపడుతోంది. గతంలో పలు గ్రామాల్లో పన్నుల దుర్వినియోగం అయిన ఘటనలు చోటు చేసుకున్నాయి. నిధుల దుర్వినియోగం కావడం, ఆలస్యంగా వెలుగు చూడడం.. వాటిపై ఫిర్యాదులు, దర్యాప్తులు, విచారణ పరిపాటిగా మారింది. వీటినన్నింటికి ఈ కొత్త విధానంతో అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు.

ఆదాయ వనరుల నమోదు

పంచాయతీల్లో ఎలాంటి లావాదేవీలు జరిగినా స్వర్ణ పంచాయతీ పేరిట ఆన్‌లైన్ చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతి పైసా, ప్రతి పని ఇకపై పక్కాగా లెక్క తేలనుంది. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు నివాస గృహాల పన్నులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది అసెస్‌మెంట్లవారీగా ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేసి డిజిటల్ రూపంలో సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు ముమ్మరం చేశారు. ఇప్పటికే సుమారు 90 శాతం పైగా వివరాల నమోదు జరిగింది. ప్రొద్దుటూరు మండల పరిధిలోని 15 పంచాయతీల్లో ఉన్న 25 సచివాలయాలకు గాను 33,908 కుటుంబాలు ఉన్నాయి. స్వర్ణపంచాయతీ వెబ్‌సైట్‌లో మొదటగా పంచాయతీ ముఖచిత్రం లోడ్ చేస్తారు. ఇంటి విస్తీర్ణం, హద్దులు, యజమాని వివరాలు, ఏడాదికి ఎంత పన్ను చెల్లిస్తున్నారు, ఆస్తి, వ్యాపార సముదాయాలకు సంబంధించి పన్నులు, చెరువులు, స్థలాలు, లీజు, సెల్‌టవర్లు, పరిశ్రమలు, రోజువారి వ్యాపారాల నుంచి చేస్తున్న వసూళ్లు ఇలా.. పంచాయతీలకు ఆదాయం తెచ్చే వాటి వివరాలను నమోదు చేస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోజరుగుతున్న అక్రమాలకు ఈ స్వర్ణ పంచాయతీలతో ఇకపై చెక్ పడనుంది. పన్నుల రూపంలో పంచాయతీలకు వస్తున్న ఆదాయం పక్కదారి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

ఆన్‌లైన్ ద్వారా పొందే అవకాశం



స్వర్ణ పంచాయతీల పేరుతో ప్రభుత్వం పౌరసేవలను సులభతరం చేస్తోంది. దీంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు అవసరమైనధ్రువీకరణ పత్రాలు, అనుమతులు ఆయా పంచాయతీల నుంచి ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చు. ఇంటి పన్ను, ఇతర రుసుంలను అదే విధానంలో చెల్లించే వెసులుబాటు కలుగుతుంది. పంచాయతీల అభివృద్ధికి డిజిటల్ సేవలలు ఎంతగానో ఉపయోగపడుతాయి.

\- ఎస్.సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీవో, ప్రొద్దుటూరు.

దేశ వ్యాప్తంగా బీసీల సమగ్ర కుల గణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు


కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మహా ధర్నాలో మాట్లాడుతున్న దుడం రెడ్డిబాబు

కడప మారుతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా సమగ్ర బీసీల కులగణన కార్యక్రమాన్ని చేపట్టాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుడం రెడ్డిబాబు పాలక ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. దేశంలో కేవలం 5 శాతం వున్న అగ్రవర్ణాలకు కల్పించిన ఈడబ్ల్యుఎస్ 10 శాతం రిజర్వేషన్‌లను వెంటనే రద్దు పరచాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట మహా ధర్నా చేపట్టారు. అంతకుముందు నగర మహావీర్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 75 సంవత్సరాలు అవుతున్నా నేటికీ బీసీ వర్గాల జనాభా తాలూకు సంఖ్యను తెలియపరచే సమగ్ర కుల గణన చేపట్టకపోవడం దారుణమన్నారు. మేమెంతో మాకంత వాటా ఇచ్చి తీరాలన్నారు. బీసీల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్‌లు కల్పించి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలలో తగిన ప్రాధాన్యత ఇచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న ఆంజనేయులు, అవ్వారు మల్లికార్జున, మదన్, మణికుమార్, వీరభాస్కర్, శివరామ్, రాష్ట్ర మహిళా నాయకురాలు ప్రశాంతి, జిల్లా మహిళా అధ్యక్షురాలు రామలక్షుమ్మ పాల్గొన్నారు. అనంతరం జేసీని కలిసి వినతిపత్రం అందజేశారు.

జాతీయస్థాయి చెస్‌లో సత్తా చాటిన జిల్లా క్రీడాకారులు


కప్ అందుకుంటున్న అష్రఫ్ సుభాని

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ చెస్ ప్రైజ్ మనీ చెస్ టోర్నమెంట్‌లో జిల్లాకు చెందిన 23 మంది క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. ఇందులో ప్రధానంగా డి.అష్రఫ్ సుభాని ప్రథమ విజేతగా నిలిచి రూ.10 వేల నగదు బహుమతిని అందుకున్నారని జిల్లా చెస్ సంఘం కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. విభాగాల వారిగా అండర్-9 బాలికలలో లాస్యప్రియ తృతీయ విజేతగా, అండర్-11 బాలికల విభాగంలో దీపికా 2వ స్థానంలో, అండర్-15 బాలికల విభాగంలో తేజోమయి ద్వితీయ స్థానంలో, అండర్-7 బాయ్స్ విభాగంలో భార్గవ్ ద్వితీయ స్థానంలో, అండర్-13 బాలుర విభాగంలో అనురాగ్ నాల్గవ స్థానంలో.. ప్రేమ్‌దీప్ 5వ స్థానంలో రాణించడం చాలా గొప్ప విషయమన్నారు.

23న హాకీ జట్టుకు ఎంపికలు

కడప స్పోర్ట్స్, జనవరి 20, (ఆంధ్రజ్యోతి): జిల్లా హాకీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ గురువారం ఉదయం 9 గంటలకు నగర రిమ్స్ సమీప స్పోర్ట్స్ స్కూల్ హాకీ మైదానంలో జిల్లా హాకీ జట్టుకు సంబంధించి బాలికల సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మహిళల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ సెక్రటరీ శేఖర్ తెలిపారు. సబ్ జూనియర్ బాలికల విభాగంలో 2009 జనవరి 1వ తేదీ తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. అలాగే జూనియర్ బాలికల విభాగంలో 2006 జనవరి 1 తర్వాత జన్మించిన బాలికలు, సీనియర్ విభాగానికి వయోపరిమితి లేదన్నారు. ఎంపికలో పాల్గొనే సబ్ జూనియర్, జూనియర్, క్రీడకారిణులు తమ వెంట ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు. ఇతర వివరాలకు 8688446515 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రవీంద్రనగర్‌లో చోరీ

- ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదు అపహరణ


బీరువాను ధ్వంసం చేసిన దృశ్యం

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కడప నగరం రవీంద్రనగర్‌లోని కిరణ్ బార్ సమీపంలోని ఓ ఇంటిలో దొంగలు పడ్డారు. ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న ఐదు తులాల బంగారు, రూ.2లక్షలు నగదును అపహరించినట్లు బాధితురాలు షేక్ సత్తాజ్ తెలిపారు. ఆమె వివరాల మేరకు.. శనివారం పిల్లవాన్ని తీసుకుని మదనపల్లెలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె భర్త కూడా ఇటీవల కువైట్‌కు వెళ్లారు. దీంతో ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న బీరువాను ధ్వంసం చేసి బంగారు నగలు, డబ్బు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు తాలుకా పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా ఇంటి బయట, ఇంటిలోపల మొత్తం రక్తం మరకలు ఉన్నాయి. అయితే తమ బంధువులు ఎవరితో అయినా కలిసి చోరీ చేసినట్లుగా ఆమె అనుమానం వ్యక్తం చేస్తోంది.

తొమ్మిది మందిపై కేసులు

చాపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దన్నవాడ గ్రామానికి చెందిన తొమ్మిది మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 19న ఆదివారం రాత్రి రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరిగింది. గంగయ్య అనేవ్యక్తి తన పొలంలోని పైరుకు నీరు పెడుతుండగా పక్కనే ఉన్న పాపయ్య తోటలోకి ఆ నీరు పారి అతని వరిగడ్డి తడిసిపోయింది. ఈ విషయమై ఒకరిపై మరొకరు కట్టెలు, రాళ్లతో దాడి చేసుకోగా వారితలలకు, చేతులకు గాయాలయ్యాయి. ఈఘటనకు సంబంధించి గంగన్న, ప్రసాద్, గంగమ్మ, చిన్నగంగన్న, పామయ్య, సాయికుమార్, లక్ష్మీనారాయణ, మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి కేసులో ముగ్గురు అరెస్టు

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిలకలబావి వద్ద గత నవంబరు నెలలో జరిగిన ఘర్షణకు సంబంధించి ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. చిలకలబావికి చెందిన అరాఫత్‌కు అదే ప్రాంతానికి చెందిన రియాజ్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. నవంబరు 18న రాత్రి అరాఫత్‌పై రియాజ్ అతని అనుచరులు దాడి చేసి గాయపరిచారు. ఈ కేసులో కడపకు చెందిన ఏపీ ఖాదర్ వల్లిఖాన్, షేక్ మహ్మద్ బాబా ఆలియాస్ తాజ్, పఠాన్ హతహుల్లా అలియాస్ అతుల్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రి సీజ్

పోరుమామిళ్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని పోలీసుస్టేషను ఎదురుగా ఉన్న గంటా చిన్నపిల్లల హాస్పిటల్‌ను వైద్యాధికారులు సీజ్ చేశారు. ఆసుపత్రిలో కారు రామయ్య అనే వ్యక్తి ఇంజక్షన్ వికటించి మరణించిన విషయం తెలిసిందే. ఈవిషయమై సోమవారం ఉప వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లేశ్, డాక్టర్ జనార్ధన్ విచారణ నిమిత్తం ఆసుపత్రికి వచ్చారు. డాక్టరు అందుబాటులో లేకపోవడంతో ఆ ఇంటి యజమానితో పాటు ఎస్ఐ కొండారెడ్డితో చర్చించి హాస్పిటల్‌కు క్లోజ్డ్ స్టిక్కరు అంటించారు. పోస్టుమార్టం రిపోర్టు వచ్చిన తరువాత జిల్లా అధికా రులు నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేస్తుండగా ప్రమాదం

- ఒకరి మృతి, ఇద్దరికి తీవ్ర అస్వస్థత
- సకాలంలో స్పందించిన పోలీసులు
- అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు


మృతి చెందిన నాగయ్య, చికిత్స పొందుతున్న చంద్రశేఖర్

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని రిమ్స్ పీఎస్ పరిధిలో రామాంజనేయపురం ఆచార్ల కాలనీలో సోమవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండగా.. ప్రమాదవశాత్తు మజ్జారి నాగయ్య (44) అనే వ్యక్తి మృతి చెందగా... మరో ఇద్దరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సంఘటనపై స్థానికులు పోలీసు లకు సమాచారం అందించడంతో రిమ్స్ పీఎస్ సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకుని.. అగ్నిమాపక శాఖ సిబ్బంది సహాయంతో సెప్టిక్ ట్యాంక్‌లో ఇరుక్కుపోయిన వ్యక్తులను బయటికి తీసి రిమ్స్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే..

కడప రామాంజనేయపురం ఆచార్లకాలనీకి చెందిన బిక్కిలి అరుణ్‌కుమార్ (39) తన ఇంటి ముందు సెప్టిక్ గుంతను సెప్టిక్ ట్యాంకరు ద్వారా శుభ్రం చేయించారు. ఆ తర్వాత మరింత మురికి బయటకు వచ్చేందుకు యాసిడ్‌ను అందులో వేశారు. మరికొంత సమయానికి నాగయ్య అనే వ్యక్తి సెప్టిక్ ట్యాంకును శుభ్రం చేసేందుకు లోపలికి దిగి ఊపిరి ఆడక పడిపోయాడు. నాగయ్యను కాపాడే ప్రయత్నంలో అరుణ్‌కుమార్ లోపలికి దిగి తాను అవస్థతకు గురయ్యాడు. దీంతో స్థానికుల కేకలు వేయడంతో మజ్జారి చంద్రశేఖర్ (26) అనే మరో వ్యక్తి వారిద్దరినీ కాపాడే ప్రయత్నం చేశారు. ఈ నేపథ్యంలో ఒకరి తరువాత మరొకరు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన స్థానికులు భయాందోళనకు గురై పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన సీఐ సీతారామిరెడ్డి, సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సెప్టిక్ ట్యాంక్‌లోని వారిని కాపాడే ప్రయత్నంలో సీఐ కూడా కొంత అస్వస్థతకు గురయ్యారు. ఈ లోపు అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని.. ప్రమాదంలో చిక్కుకున్న నాగయ్యను తాళ్లతో బయటికి లాగి 108లో రిమ్స్‌కు తరలించగా... కొంతసేపటికి మృతి చెందాడు. అరుణ్‌కుమార్, చంద్రశేఖర్‌లు చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సీతారామిరెడ్డి తెలిపారు. కాగా మృతుడు నాగయ్య బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇతనికి భార్య లక్ష్మీదేవి, చంద్రిక, చరణ్, చంద్ర అనే ముగ్గురు సంతానం.


రిమ్స్‌లో రోదిస్తున్న మృతుని బంధువులు

హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష

వీరపునాయునిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 2014లో జరిగిన హత్యాయత్నం కేసులో 12 మందికి మూడేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. మండలంలోని ఎరమలపల్లె గ్రామంలో బొమ్మరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, అతని భార్య అరుణలకు 2005లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు అనంతరం భార్య భర్తల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషులు పంచాయతీ మేరకు ఎవరికి వారు విడివిడిగా కాపు ఉండేవారు. ఈ క్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి తన భార్య, పిల్లల జీవనోపాధి నిమిత్తం రూ.12లక్షలు ఎల్ఐసీ బాండ్లు, డబ్బు మరియు నాలుగు సెంట్ల స్థలం ఇచ్చాడు. అనంతరం చంద్రశేఖర్‌రెడ్డి గ్రూప్-2 పరీక్షలో సెలెక్ట్ అయి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం వచ్చింది. అనంతరం అతని భార్య, మరికొందరు కలిసి ఇంకా తమకు ఎక్కువ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ చేసుకుందామని పిలిపించి చంద్రశేఖర్‌రెడ్డిపై, అతని బంధువైన రామకృష్ణారెడ్డి అనే అతనిపై రాడ్లు, కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎస్కే రోషన్ కేసు నమోదు చేశారు. ఈ కేసు ప్రొద్దుటూరు అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టులో విచారణకు రాగా ప్రస్తుత ఎస్ఐ మంజునాథ్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపర్చగా.. 12 మందికి మూడేళ్ల జైలు, ఒక్కొక్కరికి రూ.3వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

ఇష్టంలేని పెళ్లి చేశారని... యువతి ఆత్మహత్య


లక్ష్మికళ (ఫైల్ ఫొటో)

మైలవరం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తనకు ఇష్టంలేని పెళ్లి చేశారని జీవితంపై విరక్తి చెంది గోరంట్ల లక్ష్మీకళ (20) అనే వివాహిత మైలవరం జలాశయంలోకి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్యాం సుందర్‌రెడ్డి వివరాల మేరకు... దొమ్మరనంద్యాల గ్రామానికి చెందిన లక్ష్మికళను గూడెం చెరువుకు చెందిన రామాంజనేయులుకు ఇచ్చి అయిదు నెలల క్రితం వివాహం చేశారు. సంక్రాంతి పండుగకు పుట్టిళ్ల అయిన దొమ్మరనంద్యాల గ్రామానికి వచ్చి తల్లివద్ద ఉండేది. 18వ తేదీ దొమ్మరనంద్యాలలోని ఇంటి నుంచి తల్లికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో లక్ష్మికళ తల్లి తన కూతురు కనిపించడంలేదని మైలవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. సోమవారం ఉదయం మైలవరం జలాశయంలో మహిళా మృతదేహం లభ్యం కావడంతో జాలర్ల సాయంతో బయటకు తీసి.. లక్ష్మికళ అని నిర్ధారించుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విషద్రావణం తాగి మహిళ మృతి

సింహాద్రిపురం, జనవరి 20 (ఆంధ్రజ్యో తి): మండలంలోని అగ్రహారం గ్రామం ఎస్సీ కాలనీకి చెందిన ప్రభావతి (55) కడుపునొప్పి తాళలేక విషద్రావణం తాగి నట్లు ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఆమె గత నెల రోజులుగా కడుపునొప్పితో బాధపడుతండేది. ఈ నెల 17వ తేదీ చీనీ చెట్లకు పిచికారి చేయడానికి తెచ్చిన పురుగుల మందు తాగింది. దీంతో అపస్మారక స్థితిలో వున్న ప్రభావతిని కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది.

జిల్లా విద్యాశాఖాధికారిగా షంషుద్దీన్



కడప ఎడ్యుకేషన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా తాండ్రపాడు డైట్ సీనియర్ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.షంషుద్దీన్‌ను కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి కోనశశిధర్ సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహిస్తున్న యు.మీనాక్షిని రిలీవ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తదుపరి ఉత్తర్వులు వచ్చేవరకు షంషుద్దీన్ కడప జిల్లా విద్యాశాఖ అధికారిగా కొనసాగుతారని సూచించారు. మీనాక్షి యదావిధిగా ప్రొద్దుటూరు ఉప విద్యాశాఖాధికారిగా కొనసాగుతారు. అయితే మీనాక్షి డీఈఓగా మాకొద్దు అంటూ ఉపాధ్యాయ సంఘాలు ఈ మధ్యకాలంలో ధర్నాలు చేయడం జరిగింది.

మా భూములు మాకు దక్కేలా చూడండి

- తహసీల్దారు వద్ద మాలల మొర


తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న మాలలు

ముద్దనూరు జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వంశపారపర్యంగా వస్తున్న మాలల మాన్యం భూములను చిన్న దుద్యాల గ్రామం వైసీపీకి చెందిన భూమిరెడ్డి గంగమ్మ పేరుతో కుటుంబ సభ్యులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని పెద్ద దుద్యాల గ్రామానికి చెందిన మాలలు వరదమ్మ మరి కొందరు సోమవారం తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ తమ సొంత గ్రామం పెద్దదుద్యాల గ్రామం అయినా చిన్నదుద్యాల గ్రామానికి కూడా తమ పూర్వీకులు కాటి కాపరి పనులు చేస్తుండేవారన్నారు. తమ పూర్వీకులకు 1910 సంవత్సరంలో చిన్న దుద్యాల గ్రామంలో సర్వే నెంబర్100లో దాదాపు 10.50 ఎకరాల భూమి అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం మాలలకు మాన్యం ఇచ్చిందన్నారు. 1956 నుంచి ఆర్‌హెచ్, ఆర్ఎస్ఆర్‌లో కూడా నమోదయ్యిందన్నారు. అప్పటి నుంచి ఎవరి పేరు మీద ఎటువంటి మార్పు చెందలేదన్నారు. 2007 సంవత్సరంలో చిన్నదుద్యాల గ్రామానికి చెందిన భూమిరెడ్డి నాగశివారెడ్డి అనే వ్యక్తి పక్కా పథకం ప్రకారం తమ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారన్నారు. మొదట పోలు లక్ష్మీనారాయణమ్మ పేరుతో అక్రమ పట్టాదారు పాస్‌బుక్ పుట్టించారు. తరువాత అదే సంవత్సరం తన తల్లి భూమిరెడ్డి గంగమ్మపేరుపై రిజిస్ట్రేషన్ చేయించాడు. ఆమె మరణాంతరంభూమిరెడ్డి నాగశివారెడ్డి పేరుతో ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. తరువాత 2022లో తన కొడుకు నాగార్జునరెడ్డికి రిజిష్టర్ చేయించారని ఆరోపించారు. తమ మాన్యం భూమి తమకు దక్కేలు చర్యలు తీసుకోవాలని తహసీల్దారుకు బాధితులు విన్నవించుకున్నారు. దీనిపై తహసీల్దారు వరదకిశోర్‌రెడ్డి మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మాలలు బాబు, రాజు, మేరి, వాసు, సుధ, రమేష్‌లు పాల్గొన్నారు.

రేపు గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయ సభాభవనంలో ఈనెల 22వ తేదీ గండికోట నిర్వాసితుల గుర్తింపు ఆధార పత్రాల పరిశీలన ఉంటుందని ఆర్డీవో సాయిశ్రీ తెలిపారు. గండికోట జలాశయం కింద కొండాపురం మండలంలో ముంపు గ్రామంగా ప్రకటించిన పి.అనంతపురం గ్రామ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ గెజిట్‌లో పేర్లు నమోదుకు బియ్యం కార్డు, ఆధార్‌కార్డు, జాబితా బ్యాంకు పాసుపుస్తకం, విద్యార్హత, ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకోవాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాలు, ఇతరత్రా పత్రాలతో ఎవరైతే గతంలో హాజరు కాలేదో అలాంటి వారు రావాలన్నారు. నిర్వాసితులు తప్పుడు గుర్తింపు ఆధార పత్రాలను సమర్పిస్తే చర్యలు తప్పవన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు: కమిషనర్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ మనోజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం కడప కార్పొరేషన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీటిలో ఇంజనీరింగ్ విభాగం మూడు, టౌన్ ప్లానింగ్ ఐదు, రెవిన్యూ ఆరు, హెల్త్ రెండు, యూపీఏ రెండు అర్జీలు వచ్చాయన్నారు. అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం, ఎస్ఈ చెన్నకేశవ రెడ్డి, సిటీ ప్లానర్ రమణ పాల్గొన్నారు.

'ఉద్యోగులను మోసం చేయవద్దు'

కడప మారుతీనగర్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులుగా చెలామణి అవుతున్న ఆర్.కె. సూర్యనారాయణ, ఎం.రమేష్‌కుమార్ ఉద్యోగులను మోసం చేయవద్దని ఏపీ జీఈఏ జిల్లా కార్యదర్శి టి.విన్సెంట్‌కుమార్, నాయకులు రామాంజనేయులు పేర్కొన్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సూర్యనారాయణను వారి సంఘం నుంచి బహిష్కరించినా ఆయన వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదన్నారు.

బ్యాంకుల్లో భద్రతా చర్యలు చేపట్టాలి

వేంపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో ఒంగతనాలు, ఎలాంటి సమస్యలు తెలత్తకుండా భద్రత చర్యలు చేపట్టాలని ఎస్‌ఐలు రంగారావు, తిరుపాల్‌నాయక్‌లు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం స్థానిక ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులను పరిశీలించారు. సీసీకెమెరాలు, సెక్యూరిటీ ఉందా అన్న వివరాలను బ్యాంకు మేనేజర్లను అడిగి తెలుసుకున్నారు. దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐలు బ్యాంకు ఉద్యోగులకు తెలిపారు.

కుష్ఠువ్యాధి గుర్తింపుపై ఇంటింటా సర్వే



బోనాలలో సర్వే చేస్తున్న వైద్య బృందం

లింగాల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధిగ్రస్తుల గుర్తింపుపై సోమవారం మండల వ్యాప్తంగా సర్వే ప్రారంభించామని లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి సుభాషిణి తెలిపారు. కుష్ఠువ్యాధి సోకిన వారెవరైన ఉంటే గుర్తించి ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ రమణారెడ్డి మాట్లాడుతూ కుష్ఠువ్యాధికి గురైన వారిని వ్యాధి ప్రారంభదశలో గుర్తిస్తే చికిత్స సులువు అవుతుందన్నారు.

రీసర్వే పక్కాగా ఉండాలి: ఆర్డీవో



శివాలపల్లెలో రీసర్వే చేయిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

చెన్నూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే పక్కాగా ఉండాలని కడప ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని శివాలపల్లెను ఎంపిక చేయడంతో సోమవారం ఆ గ్రామంలో రీసర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతిరోజూ 20 ఎకరాల మేర సర్వే చేయిస్తామన్నారు. శివాలపల్లె గ్రామ రెవెన్యూలో 897.28 ఎకరాలు ఉందని, ఈ భూములను రీసర్వే చేస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు తమ భూముల వద్ద ఉండి సర్వే చేయించుకోవాలన్నారు.గతంలో గొలుసుతో సర్వే చేశారని, దీంతో కొలతలు అటుఇటుగా ఉండేవని, ఇప్పుడు సాంకేతికతతో చేపట్టే సర్వేలో ఏ మాత్రం తేడా ఉండదన్నారు. ప్రతి భూమికి పక్కాగా సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేసి సరైన కొలతలతో రికార్డుల్లో నమోదు చేసి రైతులకు సర్టిఫికెట్ ఇస్తామన్నారు. కాలక్రమంలో కొన్ని భూములకు సంబంధించిన రికార్డుల్లో ఒకరి భూమి పక్క మరో భూమిలో సుమారు నాలుగైదు సెంట్లు వేరే వారి భూమిలో ఉన్నా వాటన్నింటినీ సర్వే చేసి వాస్తవ భూమి ఆ రైతుకు ఎంత ఉందో తేల్చి చూపిస్తామన్నారు. కావున రైతులు కూడా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. రోజుకు 20 ఎకరాలు మా త్రమే రీ సర్వే చేపడతామని వాగులు, వంకలు పోరంబోకు భూములు, డీకేటీ, బంజరు, చెరువులు, కాల్వలు, కొండలు, ఏరు తదితరాల విషయంలో కూడా చూసి ఎక్కడెక్కడ ఏ మేరకు భూమి ఉందో నిర్ధారిస్తామన్నారు. పూర్వపు రికార్డుల్లో ఎంత భూమి ఉందో అంత మేర సరిగ్గా అందిస్తామన్నారు. ఇందుకోసం ప్రతి రీసర్వేలో ఇద్దరు సర్వే సిబ్బంది, స్థానిక సర్వే డీటీ, ఆర్‌ఐ, వీఆర్వోలు ఉంటారని ఆయన తెలిపారు. అలాగే సర్వే ఏడీ మురళీక్రిష్ణ శివాలపల్లె రెవెన్యూలో సర్వేను ఎలా చేయాలి, కొలతలు, వాటి వివరాలు వంటి విషయాలు రైతులకు వివరించారు. తహసీల్దారు సరస్వతి, మండల సర్వేయరు సోమశేఖర్, సర్వే డీటీ అర్చన, డీటీ వెంకటరమణ, ఆర్‌ఐ కౌశిక్, డీఐఓఎస్ బాలాజీ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో...

పెద్దకాంపల్లెలో సోమవారం రీసర్వేను ప్రారంభించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దారు, సర్వేయర్లు, రైతుల సమక్షంలో రీ సర్వేను ప్రారంభించారు. కొలతలు వేసి రైతులకు సరైన అవగాహన కల్పించాలని తహసీల్దారు నాగేశ్వర రావు రీసర్వే సిబ్బందికి సూచించారు.

టెంకాయల వేలం రూ.4 లక్షలు

సికెదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ గుడి టెంకాయల వేలం రూ.4,01,000 పాడి వెంకటలక్ష్మి అనే మహిళ దక్కించుకున్నట్లు ఈవో రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆలయం ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేలం పాటలో వెంకటలక్ష్మి వేలం దక్కించుకుంది. ఫిబ్రవరి 2025 సంవత్సరం నుంచి 2026 జనవరి వరకు టెంకాయలు అమ్ముకునే హక్కు వెంకటలక్ష్మికి ఉంటుందని తెలిపారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందిస్తున్న తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి


పులివెందుల టౌన్, జనవరి 20 (ఆంధ్ర జ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు అండగా నిలుస్తోందని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.22, 17,000 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా జోగిరెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఎంతగానో దోహదపడుతుందన్నారు. దీని ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుతుందన్నారు.పేదల ఆరోగ్యం పట్ల కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందన్నారు.అలాగే పులివెందుల నియోజకవర్గానికి సీఎం రిలీఫ్ ఫండ్, ఎల్‌ఓసీల విషయంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన వారు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి, బీటెక్ రవికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లింగాల మండల టీడీపీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అందరూ అక్షరాస్యులు కావాలి : జేసీ

కడప కలెక్టరేట్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అందరూ అక్షరాస్యులు కావాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవనంలో వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ చిన్నతనంలో చదువుకు నోచుకోని 15 ఏళ్లు దాటిన వారందరికీ చదవడం, నేర్పించి వారు మెరుగైన జీవన ప్రమాణాలను సాధించేలా చేయడమే ఉల్లాస్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు.

విద్య, సామాజిక రంగాలలో కృషీవలుడు రామసుబ్బన్న

● రేపు 25వ తేదీ రామసుబ్బన్న వర్ధంతి



రాష్ట్రపతి వి.వి గిరిచే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న రామసుబ్బన్న (ఫైల్)

వీరపునాయునిపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్య, సామాజిక రంగాలలో కృషీవలుడు ఒంటిగారి రామసుబ్బన్న అని పలువురు కొనియాడారు. ఈనెల 22న రామసుబ్బన్న 25వ వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం. వీరపునాయునిపల్లె మండలం ఎన్.పాలగిరి గ్రామంలో 1925 మేనెల 1వ తేదీన గంగమ్మ, తిమ్మయ్యకు జన్మించారు. ఆయన పాలగిరి, నందిమండలంలో 8వ తరగతి వరకు చదివారు. పాస్ అయ్యాడు. అనంతరం లండన్ మిషన్ ట్రైనింగ్ స్కూల్లో 1942-44 విద్యాంసవత్సరంలో హయ్యర్ గ్రేడ్ ట్రైనింగ్ పూర్తి చేశారు. శిక్షణ అనంతర పుట్టిపెరిగిన పాలగిరిలోని ఎలిమెంటరీ పాఠశాలలో హయ్యర్ గ్రేడ్ వృత్తిని చేపట్టారు. అప్పట్లో జీతం నెలకు రూ.14 వేతనతో పనిచేశారు. ఆ తర్వాత 1947 ఆగస్టు 4వ తేదీన వీరపునాయునిపల్లెలో హిందూ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలలో మూడవ ఉపాధ్యాయుడుగా చేరారు. ఆయన సేవలను గుర్తించి యాజమాన్యం రామసుబ్బన్నకు పాఠశాలను అప్పగించారు. ఆ పాఠశాలకు రామసుబ్బన్న నేతాజీ ఎయిడెడ్ ఎలిమెంటరీ పాఠశాలగా నామకరణం చేశారు. అప్పటి నుంచి టీచర్ కం మేనేజర్ అయ్యారు. ఎంతోమంది పిల్లలు సంగమేశ్వర విద్యాసంస్థలలో చదువుకొని ఉన్నతస్థానాలలో ఉన్నారు. ఒక మారుమూల కు గ్రామంలో కేజీ నుంచి పీజీ వరకు విద్య అందుబాటులో ఉందటే దానికి నిలువెత్తు నిదర్శనం ఒంటిగారి రామసుబ్బన్న అని అందరూ ప్రశంసిస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై చొరవ చూపండి: ఎమ్మెల్సీ

పులివెందుల టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో ఉన్న సమస్యలపై చొరవ చూపాలని భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి ఆర్‌జేడీ శ్యామ్యూల్‌కు సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో ఆర్‌జేడీ మర్యాదపూర్వకంగా ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యారంగ సమస్యలను గుర్తించి పరిష్కారానికి తోడ్పడాలన్నారు. జిల్లాలో గతంలో పనిచేసిన అధికారులు అవినీతికి పాల్పడి విద్యా వ్యవస్థకు చెడ్డ పేరు తేవడం జరిగిందన్నారు. బాధ్యతాయుతంగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు.

వాహనాల తనిఖీ

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : కడప రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం ఇన్‌స్పెక్టరు సీతారామిరెడ్డి మరియు ఎస్‌ఐ యువై జయరాములు ఆకస్మికంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలకు కాలుష్య ప్రమాణాల నిబంధనలు ఉల్లంఘించి బుల్లెట్, స్పోర్ట్స్ వాహనాల సైలెన్సర్‌లు మారుస్తున్న వారికి జరిమానా విధించారు. మరోసారి శబ్ద కాలుష్యం చేసే ఇతర సైలెన్సర్లను వాడితే బైకులు సీజ్ చేస్తామని హెచ్చరించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

● అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్‌బాబు



మాట్లాడుతున్న అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాశ్‌బాబు(ఇన్‌సెట్) హాజరైన సిబ్బంది

కడప క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఏఆర్ సిబ్బంది ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్‌బాబు అన్నారు. ఏఆర్ సిబ్బందికి నిర్వహిస్తున్న మొబిలైజేషన్‌లో భాగంగా స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో సోమవారం శిక్షణ తరగతుల్లో ప్రకాశ్‌బాబు సిబ్బందికి ఆరోగ్యంపై జాగ్రత్తలు తెలియజేశారు. శారీరకంగా, మానసికంగా బలంగా ఉన్నప్పుడే విధులు సమర్థవంతంగా నిర్వర్తించగలరన్నారు. యోగా, ధ్యానం, వ్యాయామం చేయడం దినచర్యలో భాగంగా అలవరచుకోవాలన్నారు. ఏఆర్ సిబ్బంది ఆయుధాల వినియోగం, నిర్వహణపై సమగ్రమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. బందోబస్తు విధుల్లో మెళకువలను వివరించారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య,ఆర్‌ఐలు ఆనంద్, శివరాముడు, శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను పరిశీలించిన అధికారులు



దేవస్థానంలోని అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న అధికారులు

సికెదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): 'దేవస్థానం స్థలంలో అక్రమ కట్టడాలు' శీర్షికన 19వ తేదీ ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వార్త రావడంతో డివిజన్ ఇన్‌స్పెక్టర్ శివయ్య సోమవారం ఆ స్థలాన్ని పరిశీలించారు. బుగ్గలేటిపల్లె పొలం సర్వే నంబరు 22/2లో 2.45 ఎకరాల్లో పురాతన వనం రామేశ్వర్‌స్వామి పేరుతో భక్తులు పూజలు నిర్వహిస్తున్నారని, సమీపంలోనే ఓ వ్యక్తి అతని కుమారుడు చనిపోవడంతో ఇక్కడే సమాధి నిర్మించి దాన్ని దేవాలయం అనే విధంగా చేపట్టారని ఏర్పాటు చేశారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు చేపడుతామన్నారు.

స్పందించిన తహసీల్దారు : తహసీల్దారు నాగేశ్వరరావు సోమవారం వీఆర్వో, సర్వేయర్లను పంపించి దేవస్థానానికి సంబంధించిన పొలానికి కొలతలు వేయించి దేవదాయ శాఖ అధికారులకు చూపించడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు. చింతకొమ్మదిన్నె టీడీపీ మండల కన్వీనర్ టక్కోలి వెంకటక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ అక్రమ కట్టడాలు తొలగించాలని సూచించారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు...

● రామనపల్లెవాసులకు 17 ఏళ్ల తర్వాత తీరిన కష్టం

● రూ.80 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం



రామనపల్లెకు కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు

చెన్నూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామనపల్లెకు వెళ్లే ప్రధాన రహదారి సమస్య 17 ఏళ్ల తర్వాత ఎట్టకేలకు తీరింది. చిన్నమాచుపల్లె హైవే రహదారి నుంచి రామనపల్లెకు ఉన్న కిలోమీటరు దూరానికి రూ.80లక్షలతో సిమెంటు రోడ్డు పూర్తి చేశారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

2007లో అప్పటి జడ్పీటీసీ సర్వేశ్వర్‌రెడ్డి తారురోడ్డు వేయించారు. ఆ తర్వాత రోడ్డంతా గుంతలు పడి ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నా ఐదేళ్లకో.. ఆరేళ్లకో ఓ సారి తాత్కాలిక మరమ్మతులు చేయడం తప్ప రోడ్డువేసిన పాపాన పోలేదు. దీంతో వర్షం వచ్చినప్పుడల్లా రోడ్డు దెబ్బతినేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎట్టకేలకు టీడీపీ క్లస్టరు ఇన్‌చార్జ్ కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పి.వెంకటసుబ్బారెడ్డి రామనపల్లె రోడ్డు సమస్యను ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన రూ.80లక్షలు మంజూరు చేయించగా రోడ్డు ఏర్పాటు చేశారు. దీంతో రామనపల్లె గ్రామంతో పాటు ఆ దారిన నిత్యం తిరిగే చిన్నమాచుపల్లె, గుర్రంపాడు, ముండ్లపల్లె, రాచిన్నాయపల్లె తదితర ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

ఫటాఫట్



హరినాథ్‌రెడ్డి, తహసీల్దార్, వేంపల్లె

వేంపల్లె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలోని రేషన్ బియ్యం దుకాణాల్లో రేషన్ బియ్యం, ఇతర వస్తువుల తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో తహసీల్దార్ మాట్లాడారు.

ప్రశ్న: రేషన్ షాపుల్లో తూకాలు తక్కువ వేస్తున్నారు.ఏం చర్యలు తీసుకుంటారు?

జవాబు: మండలంలోని రేషన్ డీలర్లు ఖచ్చితంగా తూకం ప్రకారం ఇవ్వాల్సిందే. సంచితో మాత్రమే తూకం వేయాలి. ఎక్కడైనా తూకాలు తక్కువ వేస్తున్నారని ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదు అందిన చోట ఇప్పటికే తనిఖీలు చేసి డీలర్లను మందలించాం. ప్రభుత్వం సరఫరా చేసిన ప్రతి వస్తువు, బియ్యం రేషన్‌దారులకు తప్పకుండా ఇవ్వాల్సిందే.

ప్రశ్న: ప్రస్తుతం ఉచిత ఇసుక విధానం ఎలా అమలవుతోంది?

జవాబు: వేంపల్లె పాపాఘ్ని నది నుంచి స్థానికంగా ఇళ్లు నిర్మించుకునే వారికి ఇసుకను ఉచితంగా అందిస్తున్నాం.ఆధార్‌కార్డు తీసుకెళ్లి సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తున్నాం. ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లతో పగలుపూట మాత్రమే ఇసుక తోలుకోవాలి. టిప్పర్లలో ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు లేవు. రాత్రి వేళల్లో ఎవరూ ఇసుకను తోలకూడదు. అలా తోలితే నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మండలంలో ప్రభుత్వ స్థలాలు, భూములు కబ్జా జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి?

జవాబు: మండలంలో ఎక్కడైనా ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తే సమాచారం అందిన వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. అది ప్రభుత్వ భూమి అయితే స్వాధీనం చేసుకుంటున్నాం.

ప్రశ్న: గత సర్వే వల్ల రైతులు ఇబ్బందులుపడుతున్నారు, ఎలా పరిష్కరిస్తారు?

జవాబు: రీసర్వే జరగడం వల్ల రైతుల పేర్లతో సర్వే నెంబర్ల భూములు ఆన్‌లైన్‌లో చూపడం లేదు. రీసర్వే జరిగిన ముతుకూరు, నాగూరు, రామిరెడ్డిపల్లె, అలిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో ఈ సమస్య ఉంది. ఎక్కువగా డీకేటీ, ఫ్రీహోల్డ్, జేఎల్‌బీ భూములకు ఈ సమస్య ఉంది. ఇన్సూరెన్స్ కట్టుకునేందుకు రైతులు ఇబ్బంది పడ్డారు. దీన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ముద్దనూరు జనవరి20(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ సభాభవనంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ముకుందారెడ్డి పేర్కొన్నారు. ప్రధానంగా తాగునీరు, వ్యవసాయం, పారిశుధ్యం,గృహనిర్మాణం, ఆరోగ్యంపై సమీక్ష ఉంటుందన్నారు. సర్పంచులు, కార్యదర్శులు, మండల అధికారులు తప్పక హాజరుకావాలని తెలిపారు.

రెండు రోజులు ఆధార్ క్యాంప్

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని కొత్తపల్లె పంచాయతీలో ఉన్న సచివాలయం-3 పరిధిలో రెండు రోజులపాటు ఆధార్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి సురేష్ కుమార్ తెలిపారు. మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్న ఈ ఆధార్ క్యాంపులో మార్పులు, చేర్పులతోపాటు వివిధ సవరణలు చేసుకునేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయ పనివేళల్లో మార్పులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదేశాల మేరకు గ్రంథాలయ పనివేళల్లో మార్పులు చేసినట్లు అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో గ్రేడ్-1 గ్రంథాలయ అధికారి తిరుపతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రంథాలయం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటలవరకు పనిచేస్తుందని పుస్తక విభాగం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, పత్రికా విభాగం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుందన్నారు.

మునిసిపాలిటీలో సమస్యల తిష్ఠ

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోపలు సమస్యలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డివిజన్ కేంద్రం జమ్మలమడుగు. నగర పంచాయతీ అభివృద్ధికి అంతంత మాత్రంలో ఉంది. గత ప్రభుత్వం నగర పంచాయతీ పరిధిలో ఎలాంటి అభివృద్ధికి సంబంధించిన పనులు చేపట్టలేదని ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నారు. అందులో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్యలు ఇబ్బందికరంగా మారింది. డ్రైనేజీ కాలువలు పలుచోట్ల పగిలిపోయి పందులు స్వైర విహారం చేస్తున్నాయి. మరికొన్ని చోట్ల డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా మారింది. కొన్ని చోట్ల డ్రైనేజీ వ్యవస్థ శుభ్రం చేయక కంపుకొడుతోందని డ్రైనేజీ నీరు వెళ్లడంలేదని వాపోతున్నారు. జమ్మలమడుగులోని పాత బస్టాండు, పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు ఇటీవల నిర్మాణాలు జరిగాయి. పట్టణంలోని పలు వీధుల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని వాపోతున్నారు. ప్రధాన రోడ్లు ఇరుకుగా మారాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్తబండ్ల కొరత ఉందని తెలుస్తోంది. పాత వాహనాలతో పారిశుధ్య సిబ్బందికి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపణలున్నాయి. అలాగే పారిశుధ్య సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జమ్మలమడుగు నగర పంచాయతీ ప్రజలకు సౌకర్యంగా కనీసం పార్కు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇరుకైన అంతంత మాత్రంగా ఉండే పార్కు నిరుపయోగంగా మారింది. ఆ ప్రాంతం ఎదురుగా కొందరు వ్యాపారులు ఆక్రమణ చేసినట్లుగా బండలు, తదితర వస్తువులు పెట్టుకుని ఇబ్బంది కలిగిస్తున్నట్లుగా ఆరోపణలపై గత మున్సిపల్ సమావేశంలో అధికారులకు కౌన్సిలర్లు తెలియజేశారు. జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులో మున్సిపాలిటీ కార్యాలయానికి పైభాగాన రోడ్డుకు ఇరువైపులా ప్రభుత్వం ఒక పెద్ద పార్కు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్య లేకుండా కాలువలు నిర్మించాలని, ఇరుకైన రోడ్లపై చర్యలు తీసుకోవాలని తదితర సమస్యలపై ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పగిలిపోయిన డ్రైనేజీ కాలువ

పింఛన్‌దారుల ఆరోగ్యస్థితిపై పరిశీలన



పింఛన్ లబ్ధిదారుడి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న డాక్టర్ వెంకటభరత్

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల పరిధిలోని పింఛన్ లబ్ధిదారుల ఆరోగ్యస్థితిపై వైద్యబృందం పరిశీలన చేపట్టారు. సోమవారం మండల పరిధిలోని కొత్తపల్లె, కల్లూరు, నంగనూరుపల్లె, ఉప్పరపల్లె, తాళ్లమాపురం గ్రామాల పరిధిలో అనారోగ్య, వైకల్య కారణాలతో మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు. కడప జీజీహెచ్‌కు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బిలావత్ సూర్యానాయక్, బద్వేలుకు చెందిన వైద్యుడు వెంకటభరత్, కల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు మహాలక్ష్మి, డిజిటల్ అసిస్టెంట్ జశ్వంత్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బందితో కూడిన బృందం లబ్ధిదారుల శారీరక, మానసిక పరిస్థితులను పరిశీలించి నివేదికలు తయారు చేస్తున్నారు.

కడప ఉక్కు కోసం నిరంతరం ఉద్యమం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కడప ఉక్కు పరిశ్రమను సాధించడానికి నిరంతరం ఉద్యమిస్తామని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, మాజీ నాయకుడు సత్యనారాయణలు తెలిపారు. సోమవారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా కడప ఉక్కు పరిశ్రమపై పురోగతి లేదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్‌రాజు, పట్టణాధ్యక్షుడు మేరీకుమార్, కార్యదర్శి విశ్వనాథ్, శ్రీనివాసులు, రమేష్, పక్కీరయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చు

ప్రొద్దుటూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ హేమకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా స్థానిక ఆర్‌టీవో కార్యాలయంలో వాహనదారులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ భాస్కర్, ఆర్‌టీవో ఏవో తదితర అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆదాయపన్నుపై సదస్సు

ప్రొద్దుటూరు,జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆదాయపన్ను చెల్లింపులపై అవగాహన కల్పించడంకోసం మంగళవారం బుశెట్టి కళ్యాణ మండపంలో ఉదయం 11 గంటలకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఇన్‌కమ్‌టాక్స్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌తెలిపారు. ఈ సదస్సుకు నెల్లూరు రేంజ్ అడిషనల్ కమిషనర్ శ్రీధర్ హాజరవుతున్నట్లుతెలిపారు.

పంట రుణాలు సకాలంలో చెల్లించండి



బ్యాంకు సిబ్బందితో కలిసి లోగోను ప్రదర్శిస్తున్న రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో

బి.కోడూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రైతులు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించి ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ పొందాలని ఏపీజీబీ రీజనల్ మేనేజరు సుశాంత్‌కుమార్ స్వారో తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బి.కోడూరు ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకును సందర్శించారు. అనంతరం రైతులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకు లో దాదాపు రూ.7 కోట్లు మేర రుణాలు రైతులు పొందారని,వీటిని ఫిబ్రవరి చివరి కల్లా రెన్యువల్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజరు అనిల్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్‌రావు, వెలుగు ఏపీయం సీతారామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

24న చౌకధరదుకాణాల భర్తీకి పరీక్షలు

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ పరిధిలో 10 మండలాల్లో ఉన్న 251 చౌకదుకాణాల ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రకటన జారీ చేసినట్లు ఆర్డీవో సాయిశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తులను 2024 డిసెంబరు 31వ తేదీ నుంచి 2005 జనవరి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు వారి వారి తహసీల్దారు కార్యాలయం ద్వారా దరఖాస్తులను స్వీకరించడమైందన్నారు. అయితే చౌక దుకాణాల భర్తీకి రాత పరీక్ష 2025 జనవరి 17వ తేదీ జరగాల్సి ఉండగా కొన్ని అనివార్య కారణాల వలన పరీక్షను 24వ తేదీ శుక్రవారం నాటికి మార్పు చేసినట్లు తెలిపారు. జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు రాత పరీక్షను ఈనెల 24వ తేదీ జమ్మలమడుగులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో (జడ్పీహెచ్‌ఎస్ స్కూల్) కాపు వీధిలో మధ్యాహ్నం 3 గంటలల నుంచి 5 గంటల వరకు చౌక దుకాణాల పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

'సమస్యలు పరిష్కరించని రెవెన్యూ సదస్సులు ఎందుకు ?'

ఎర్రగుంట్ల, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని నిర్వహించినా అందులో ఫిర్యాదుల చేసిన సమస్యలకు మాత్రం పరిష్కారం దొరకడంలేదని బాధితులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎర్రగుంట్ల స్వప్న సందుకు చెందిన 489 సర్వేనెంబరులోని 2.40ఎకరాల భూమిని 22ఏ నిషేధిత జాబితాలో గత రెవెన్యూ అధికారులు చేర్చారు. దీంతో జనవరి 2వ తేదీ ఎర్రగుంట్ల నగరపంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో 2.10ఎకరా భూమిలో తాము నివాసం ఉంటున్నామని ఇది పట్టా ఆస్తులని ఫిర్యాదు చేశారు. దాన్ని వెంటనే పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే సోమవారం ఆ వీధికిచెందిన బాదితులు స్పందనలో తహసీల్దార్ కార్యాలయంకు వెళ్లి తమ సమస్యపై అడిగారు. అక్కడ వారికి పాత సమాధానమే అధికారులు ఇవ్వడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగాస్వప్న సందుకు చెందిన ఫైల్ ఆర్డీవో కార్యాలయంలో ఉందని డీటీ యామిని తెలిపారు.

చెన్నమనేనిపల్లెలో భూముల రీసర్వే వాయిదా

కొండాపురం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నమనేనిపల్లె గ్రామంలో సోమవారం జరగాల్సిన భూముల రీసర్వే వాయిదా పడినట్లు తహసీల్దార్ గురప్ప తెలిపారు. ప్రస్తుతం తమ భూముల్లో శనగ పంట వేసుకున్నామని, రీసర్వే వల్ల తమ పంటకు అంతరాయం ఏర్పడుతుందని రైతులు తెలిపారన్నారు. పంటకోత పూర్తయిన తర్వాత రీసర్వే చేయమని రైతులు నెలరోజులు గడువు కోరారన్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తహసీల్దార్ తెలిపారు.

ఇంటింటి చెత్త సేకరణతోనే పట్టణ పరిశుభ్రత

ప్రొద్దుటూరు ,జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటి చెత్త సేకరణ వందశాతం అమలు అయినప్పుడే పట్టణం పరిశుభ్రంగా వుండగలదని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కోన్నారు. సోమవారం పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణపై క్షేత్ర స్థాయిలో ఎలా అమలు అవుతుందో పర్యవేక్షించారు. కమిషనర్‌వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషా వున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా కేతవరం గ్రామం ఎంపిక

చాపాడు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): రీ సర్వే కోసం కేతవరం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తహసీల్దారు రమాకుమారి తెలిపారు. ఈ గ్రామంలో మొత్తం 437 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూములను సర్వే చేసేందుకు ముగ్గురు సర్వేయర్లను నియమించామన్నారు. ప్రతిరోజు 20 ఎకరాలు భూమిని కొలతలు వేస్తున్నట్లు తెలిపారు. రైతులతో మాట్లాడి వారి అనుమతి మేరకు కొలతలు వేస్తామన్నారు. సోమవారం నుంచి రీసర్వే పనులు మొదలు పెట్టినట్లు ఆమె చెప్పారు.

బ్రహ్మంగారి హుండీ ఆదాయం రూ.22.30 లక్షలు

బ్రహ్మంగారిమఠం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : మఠం హుండీలో కానుకలను సోమవారం లెక్కించగా 22,30,585 రూపాయలు నగదు, అలాగే బంగారు 3 గ్రాముల 200 మిల్లీగ్రాములు, వెండి 90 గ్రాములు వచ్చినట్లు దేవస్థాన ఫిట్‌పర్సన్ శంకరబాలాజీ తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు మఠాధిపతి కుమారులు, రాజంపేట ఎండోమెంట్ ఇన్‌స్పెక్టరు జనార్దన్, మఠం మేనేజరు ఎన్.ఈశ్వరయ్యాచారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా ఏడు హుండీలను రెండు నెలల కాలానికి లెక్కించినట్లు ఆయన తెలిపారు.

మాదక ద్రవ్యాల జోలికి పోతే తాట తీస్తాం

మోహన్, సీఐ, ఖాజీపేట



ఖాజీపేట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో మాదకద్రవ్యాల జోలికి వెళితే ఎటువంటివారినైనా చర్యలు తీసుకుంటామని ఖాజీపేట సీఐ మోహన్ అఈన్నారు. ట్రాఫిక్‌కు విరుద్ధంగా వాహనాలు రోడ్డుపై పెట్టి బాతాఖానీలుకొడితేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా అనుమానితులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ప్రజల్లో చైతన్యం వస్తేనే అభివృద్ధి కనపడుతుందన్న ఖాజీపేట సీఐ మోహన్‌తో ప్రత్యేక ఇంటర్వ్యూ...

ప్రశ్న: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై ఎటువంటి చర్యలు తసుకుంటున్నారు.

జవాబు: ఎప్పటికప్పుడు పోలీసులు తనిఖీలు చేస్తూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగేవారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నాం. హైవేల్లో మద్యం అమ్మినా, తాగించిన హోటళ్ల యజమానులపై చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: లాడ్జీల్లో, రూముల్లో పేకాట ఆడుతున్నారు. దానిపై...

జవాబు: రాత్రివేళల్లో గస్తీ నిర్వహిస్తున్నాం. లాడ్జీల్లో కూడా తనిఖీలు చేస్తున్నాం. ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు కనపడితే పోలీసులకు సమాచారం అందిస్తే వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం. లాడ్జీల్లో ఆడుతూ పట్టుబడితే యజమానిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: మాదకద్రవ్యాలు, గంజాయి విద్యార్థులుతాగుతున్నట్లు సమాచారం.

జవాబు: వదంతులు వస్తున్నాయి తప్ప ఎక్కడా అటువంటి కార్యక్రమాలు జరుగలేదు. పట్టుబడితే వారిజీవితాలు వారే నాశనం చేసుకున్నట్లు అవుతుంది. తల్లిదండ్రులు కూడా పిల్లలపై నిఘా ఉంచాలి.

ప్రశ్న: పోలీసులపై రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా?

జవాబు: చట్టానికి లోబడి పనిచేస్తాం తప్ప రాజకీయాలకు పనిచేయం. మాకు ఎక్కడా రాజకీయ ఒత్తిళ్లు లేవు. పోలీసులు చెబితే అన్ని పార్టీలవారు సహకరిస్తున్నారు.

ప్రశ్న: స్కూళ్లు, కాలేజీల వద్ద ఈవ్‌టీజింగ్‌పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు: కాలేజీలు, స్కూళ్ల వద్ద నిఘా పెట్టాం, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు, కాలేజీల్లో, స్కూళ్లలోవిద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: మీరు వచ్చితర్వాత దొంగతనాలు జరిగాయా.

జవాబు: రాత్రివేళల్లో డ్యూటీలో ఉన్న వారు కంటిమీద కునుకు లేకుండా డ్యూటీ చేస్తున్నారు. వారిపై కూడా మేము తనిఖీలు చేస్తున్నాం. రైతుల బోర్ల వద్ద వైర్లు తీసుకెళ్లే దొంగలను పట్టుకుని వారి వద్ద నుంచి కేబుల్ వైరు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశాం.

ప్రశ్న: ఫ్రెండ్లీ పోలీసులపై మీ సమాధానం.

జవాబు: ప్రజలు సమస్యలతో వస్తారని, వారిని కూర్చోబెట్టి వారితో చర్చించిన తర్వాత సమస్య అడిగి తెలుసుకుని పరిష్కరిస్తాం. లేదంటే ఫలానా కార్యాలయానికి వెళితే మీ సమస్య పరిష్కారం అవుతుందని వారికి అర్థమయ్యే విధంగా వివరించి చెబుతాం.

26 నుంచి హోటళ్లలో ప్లాస్టిక్‌ను నిషేధించాలి



హోటళ్లలో ప్లాస్టిక్ కవర్లను తనిఖీచేస్తున్న కమిషనర్

బద్వేలు, జనవరి20 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని అన్ని హోటళ్లు మరియు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో జనవరి 26వ తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం ఆయన పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ వేడి వేడి ఆహార పదార్థాలు ప్లాస్టిక్ కవర్లపై ఇవ్వడం ద్వారా పార్శిళ్లు కూడా ప్లాస్టిక్ కవర్ల ద్వారా అందించడం జరుగుతుంది దీని ద్వారా భవిష్యత్తులో ప్రాణాంతకర వ్యాధి అయిన క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉందన్నారు. హోటళ్లలో తినేవారికి విస్తరాకు,అరిటాకు వంటి వాటిపై మాత్రమే వడ్డించాలని తదితర సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వంతెనపై నుంచి నీటిలోకి దూకిన వ్యక్తి

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డు పెన్నానది వంతెనపై నుంచి సోమవారం రాత్రి గూడెం చెరువు గ్రామానికి చెందిన చిన్నెత్తి పెద్ద గురప్ప నీటిలోకి దూకిన ఘటన చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు, అధికారులు పెన్నానది వంతెనవద్ద నీటిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇంటి వద్ద భార్య నాగమణికి జమ్మలమడుగు వెళ్లి వస్తానని చెప్పి వంతెన వద్దకు వెళ్లి నీటిలోకి దూకాడు. అర్బన్ సీఐ లింగప్ప, ఎస్ఐ రామక్రిష్ణ, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి రాత్రి తొమ్మిది గంటలకు గాయపడి ఉన్న వ్యక్తిని కనుగొని ప్రభుత్వ ఆస్పత్రికి చేర్చారు. పెన్నానదిలోకి దూకిఆత్మహత్యకు ప్రయత్నించ డానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వినతి

జమ్మలమడుగు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు ఊసుగాండ్ల పెద్ద వెంకటేష్ కుటుంబాన్ని ఆదుకోవాలని జమ్మలమడుగు చేనేత అసెంబ్లీ కన్వీనర్ శిలివేరి వెంకటేశ్వర్లు, బాధిత కుటుంబ సభ్యులు జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీకి సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ చేనేత కార్మికుడు జమ్మలమడుగు మండలం గూడెం చెరువు గ్రామం రాజీవ్‌నగర్ కాలనీలో ఊసుగాండ్ల పెద్ద వెంకటేష్ నివాసం ఉన్నారు. కాగా అప్పుల బాధతో 2024 డిసెంబరు 18వ తేదీ మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయనకు భార్య సుమలత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సీతారామయ్య, పాములేటి, ఎన్.శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోండి



ప్రొద్దుటూరు మండలంలోని నంగనూరుపల్లెలో మేకకు నట్టల నివారణ మందును తాపుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పంటలకు ప్రత్యామ్నాయంగా నిలుస్తున్న పాడి సంపద ఆరోగ్యంగా ఉన్నప్పుడే రైతులకు లాభసాటిగా మారుతుందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నంగనూరు పల్లె గ్రామంలో సోమవారం పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉచిత పశు ఆరోగ్య శిబిరాల గోడపత్రాలను ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ జేడీ సి.శారదమ్మ, ప్రొద్దుటూరు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ఆర్.ధనుంజయరెడ్డి, కేసీ కెనాల్ ప్రాజెక్టు కమిటీ వైస్‌చైర్మన్ ద్వార్శల గురివిరెడ్డి, మండల పశువైద్య అధికారి టి.సరస్వతి, పశువైద్య అధికారులు సదాశివయ్య, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగు మండలంలోని పి.సుగుమంచిపల్లె గ్రామంలో సోమవారం ఉచితపశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ ఒంటెద్దు సుధాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ నుంచి 31 వరకు ఉచిత పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశువుల డాక్టర్ దస్తగిరమ్మ, జాన్ సుధాకర్, పశువుల యజమానులు పాల్గొన్నారు.

రాజుపాలెం..: పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కేసీ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పశువైద్యశిబిరాన్ని కొరపాడు గ్రామంలో ఆయన ప్రారంభించారు.ఈ శిబిరంలో ఏడీ వెంకటేశ్వర్లు, టి.లక్ష్మీదేవి, కె.రెహనాబేగం, జాషువా పాల్గొన్నారు.

ముద్దనూరు..: మండల పరిధి తిమ్మాపురం గ్రామంలో సోమవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇన్‌చార్జి ఏడీ డాక్టర్ శ్రీనివాస ఆవులు, గేదెలు, గొర్రెల, మేకలకు నట్టల నివారణ మందు, పశువులకు గర్భకోశ వ్యాధి పరీక్షలు చేశారు. పశువైద్య సిబ్బంది శశిరేఖ, నాగమయ్య, యాసిఫ్, లావణ్య పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: పాడి రైతులు, పశుపోషకులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చిలమకూరు పశువైద్యాధికారి మహేశ్వరరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారంమండలంలోని రంగసాయి పురంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఏడీ డాక్టర్ బి.మునయ్య, డాక్టర్ జ్యోతి పాల్గొన్నారు.

కాశినాయన..: మండలంలో ఈనెల చివరి వరకు 11 రోజులపాటు నిర్వహిస్తున్న ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ రామారావు పేర్కొన్నారు. సోమవారం కోడిగుడ్లపాడు, ఆనంవారిపల్లె గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట..: పాడి రైతులు పశువులకు గర్భకోశ వ్యాధులు రాకుండా చూసుకుంటే అభివృద్ధి చెందవచ్చని సహాయ సంచాలకుడు మురళి అన్నారు. సోమవారం కొత్తపల్లె, సన్నపల్లె పంచాయతీల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య అధికారులు రామచంద్ర, లక్షుమయ్య, సిబ్బంది పాల్గొన్నారు.